# అంత్య సందేశం

రచన:
శ్రీమతి. పఠానేని శ్రీ శైల భ్రమరాంబ

"సచ్చిపోతూన్నాడు బాబో మా ఓడికి వాతం కమ్మేసిందటండోయ్! నా కొంప నిలువునా కూలిపోతోంది తండ్రిగారో! నన్ను రక్షించండి బాబయా! మా యిల్లు నిలబెట్టండి దరమ పెబువుగారో!" అంటూ భూఖామందు గంగాధరం గుమ్మం ముందుకొచ్చి ఆయన పాదాలకి దణ్ణం పెడ్తూ కూలబడి పోయిందిరత్తాలు—

తెల్లబోయి చూస్తున్నారు అక్కడ కూర్చున్న వారందరూ. ఎందుకన్నట్లు చూచాడు రత్తాలు వైపు గంగాధరం—

"మీపాలేరుకి వాతం కమ్మేత్తోందంట బాబయ్యా! డాకేటరు గోరు అయిదు రూపాయలు తెత్తేనే సూది పోటు ఏత్తానన్నారు బాబయ్యా! ఆధరమతండ్రి సూది ఇండీసను బుడ్డి తెస్తే ఊరికేనే మాయింటికాడి కొచ్చి చేత్తానన్నారు బాబయ్యా! నా ఆదరువు నిలువునా కూలిపోతోంది! మావోడిని రచ్చించండి బాబయ్యా!" అంటూ ఏడుస్తూ చెప్పింది రత్తాలు—

రత్తాలు నిండు చూలాలు. ఆమె కార్చిన కన్నీరు చారలు కట్టి తైల సంస్కారం లేని జుట్టు రేగిపోయి అట్టలు కట్టి, లోతుకుపోయిన కళ్ళు బాగా ఏడ్చినందురు గుర్తుగా కన్పిస్తున్నాయి.

"అదేమిటో సెప్పకుండా ఏడిత్తే ఎల్లాగే? ఏటో నీగోడు సెప్పు? గంగాదరంబాబు గోరంటే బగమంతుడు లాంటివోరు ఆరి దగ్గర సెప్పుకోడానికి మనకేమీ బయంనేదే రత్తాలూ' అన్నాడు అక్కడ కూర్చుని చుట్ట కాలుస్తూన్న ఓ రైతు—

"ఏం జర్గిందేంటే? నీ మొగుడెట్టావున్నాడు? అదే మద్దినికాయిలా పడ్డాడని సెప్పేడు మీ ముసిలోడు.' అన్నాడు ఇంకొకరు.

ఏం చెబుతుందో చూద్దామని చూస్తున్నాడు గంగాధరం—

'అయ్యాల ఒల్లు బాగుండలేదని తమకాడికి పనికి ఒచ్చి ఎల్లినకాడినుంచీ మా ఓడు మల్లీ మంచంమీంచి లెగనేలేదండి బాబయ్యా. ఇయ్యాలకి కానా రోజులయిందండి కూలికి ఎల్లి, మంచానికి బల్లిగా అంటుకుపోనాడండి దున్నపోతులాంటివోడు. ధరమాసుపటాల్లోకి తీసుకెళ్ళి సూపించినామండి. ఆడాటరుగోరు సీటీ ఇత్తే కంపరెంటుగారు మందిత్తున్నారండి. నిన్న సందాలనుంచీ సూసినకన్ను తెరాకుండా పడుంటే బయమేసి, నేనూ మామయ్య ఎల్లి డాటరుగోరిని తీసుకొచ్చి సూపిత్తే ఆరు దయదలిసి ఓ సూదిమందు గుచ్చారండి - మల్లీ యియ్యాల కూడా వచ్చి సూసి 'ఈడికి పెద్ద బుడ్డిలో ఇండీసను ఇవ్వకపోతే బతకడు. అయిదు రూపాయిలు తెచ్చుకోమన్నారండి. బాబయ్యా మూడురోజులనుంచి ఇంటో పిల్లలు నేనూ ముసిలోడూ, గంజికూడా తాగనేదండి. తమరు కనికారంవుంచి అయిదు రూపాయిలిత్తే నా కొంప నిలబెట్టినోరు తండ్రీ' అంటూ శోకం కొంత తగ్గినా ఎక్కుతోనే చెప్పింది రత్తాలు—

'ఏమిటే వెధవ గొడవా నువ్వూను? ప్రొద్దున్నే ఏడుస్తూ గుమ్మంలోకి వచ్చావ్? పో! నీ కోసం డబ్బు మూటకట్టుకు కూర్చున్నావను కొన్నావా?' అంటూ కసిరి చెప్పాడు గంగాధరం—

'బాబయ్యా! తమ పాదాలకాడ బతికేవోళ్ళం ఈ కట్టకాలంలో కామందులు కాకపోతే మమ్మల్ని ఎవరు రచ్చిత్తారు బాబయ్యా! మీ పొలంగో కూలిసేసుకు తీర్చుకొంటామే కాని ఒదిలెయ్యం బాబయ్యా! నా బొట్టు నిలబెట్టండి బాబయ్యా! మా కర్రోళ్లు అన్నంపురెం తెలీని నోరులేనోళ్ళు. ఇంకా సూడలని కానే ఈడు కూడా రానోళ్ళు. మా మావయ్యకి పెద్దకాలం వచ్చింది. మా ఓరు ఒక్కడే కొడుకు - మేమంతా మా ఓడిమీదే ఆదరవు పడి వున్నాం బాబయ్యా! మీకు పాలేరు తనం చేసి తీరుసుకుంటాం తండ్రీ మమ్మల్ని రచ్చించండి' అంటూ నల్లరాళ్ళని కూడా నవనీతంలా కరిగించేటంత జాలిగా అడిగింది రత్తాలు—

'అయితే వాడు మంచంపట్టి ఎన్నిరోజులైదంటావ్?' అన్నాడు లాయర్లా—

ఆ రోజులు పెక్క నాకు తెలదుగానండి ఒక్కొక్క రోజుకి ఒక్కొక్క గీత పెట్టానండి తలుపుమీద మసిబొగ్గుతో - అయ్యాల సెలపాడుపునాడు నుంచీ మంచం మీంచి లెగనేలేదండి - కానారోజులైందండి బాబయా! అదేదో జరకంటండి. అందులో వాతం వచ్చిందంటండి

తమ పాదాల్ని నమ్ముకు వచ్చినానండి బాబయ్యా! చేమ్మలకి కనికారం ఎక్కువని తమరు అనుగ్రాగంవుంచి ఇత్తారని కొండంత ఆశతో వచ్చానండి బాబయ్యా! తమరే మా వోడిని రచ్చించిన వారౌతారు బాబయ్యా!' అంటూ దీనంగా వేడుకుంది రత్తాలు—

అయితే పూళ్ళో ఏ హాస్పత్రిలో ఇప్పిస్తున్నావ్ మందు?' ఇంకా వివరాలు తెల్సుకోవాలన్నట్లు అడిగాడు గంగాధరం—

'ఆరెవరో మాలాంటి బీదోళ్ళకి ధరమంగా మందులివ్వడానికి ఆసుపటాలు పెట్టారంటగాదంటి, ఆరి దగ్గర ఇప్పిత్తున్నాం. ఆరే సెప్పారండి. అయిదు రూపాయిలు తెచ్చుకో మనండి' అంది ఎంతో బాధగా రత్తాలు.

'ఈ ఊళ్లో గవర్నమెంటు ఆసుపటాలు పెడితే కూలీ నాలీ చేసుకునే బీదోళ్లు బతికి పోదురుగదాండి. ఆ అదురుట్టం మా ఊరికి ఎప్పుడొత్తాదో. తిండిలేక ఏడిసే మాలాంటి వోళ్ళకి రోగాలు కూడా ఎక్కువండి. పాపం! ఊడుపుల్లో వానల్లోంచి ఇన్నాళ్లూ బాగా తడిసి పోయి మంచం ఎక్కి పడకేశాడు - అయిదు రూపాయిలు మాలాంటి వోళ్లకి ఎంత కష్టపడితే నండి అయిదు రూపాయిలు రావడం? ఇయ్యండి బాబయ్యా! అడులేచి తిరిగాక తమరికాడ కూలిచేసుకుని తీరుసుకుంటాడు. ఆ కొడుకు రోగంతో ముసిలోడు కూడా కుంగిపోయాడు. దీనికి నిండు. ముగ్గురు పిల్లలూ సంటోళ్లూ. ఈ నెల్లో యిది నీళ్లాడేశాక మా పొలంకాడ ముగ్గురూపని సేసి తీర్చేత్తారులెండి బాబయ్యా! కాత్త తొందరగా ఇచ్చి పంపించెయ్యండి - పాపం! అడు ఎల్లాగుంటాడో యేంటో' అంటూ అక్కడ దూరంగా కూర్చున్న ఓ పేద కూలీ కూడా రికమెండ్ చేశాడు - సాటివాని కష్టానికి సానుభూతి చూపిస్తూ.

'ఇంజక్షన్ చేయిస్తే మాత్రం తగ్గుతుందన్న నిఖార్సేమిటి? డాక్టర్లు డబ్బు గుంజుకోవడానికి అల్లాగే చెప్తారు. తీరా ఐదు రూపాయిలు పుచ్చుకున్నాక తగ్గకపోతే మీరేం చేస్తారు?' అన్నాడు నిరాశగా గంగాధరం.

'ఆ డాక్టేరుగారు అల్లాంటోరు కారు బాబయ్యా! ఆయన శాయిశ్శత్తులా మా ఓడిని బతికిత్తానని శానా సారులు సెప్పినారండి- మా గెట్టి మందులు, పెద్దగాటు చేదు మందులు ఇత్తున్నారండి. తమరు అయిదు రూపాయిలు ఇత్తే మా ఓడు యిదాయికంగా బతుకుతాడండి బాబయ్యా' అంటూ దృఢమైన నమ్మకతో అంది రత్తాలు -

'ఇరవై రోజులై మంచాన్న పడ్డవాడు - ఇంకా తగ్గి కూలి పనిలోకి వస్తాడనేనా నీ ఆశ? ఆయుర్దాయం గట్టిదైతే ఔషధంతో పనేముంది రత్తాలూ? తీరా యీ ఐదు రూపాయిలూ కూడా డాక్టరుకి అర్పించుకున్నాక వాడు బ్రతక్క పోతే మీరింకా కష్టపడి పోతారు. వాడి కర్మ ఎలావుంటే అలా అవుతుంది. ఏదో మందు పోస్తున్నారు కాని ఊరుకో లేదుకదా, వాడికి భూమ్మీద నూకలుంటే మళ్లీ బ్రతుకుతాడు. లేకపోతే...'

అయ్యబాబు అయ్యబాబో! అంతమాట అనకండి బాబయ్యో! మా కందరికీ ఆదరువు మా ఓడేనండి బాబయ్యా! ఆడు సల్లగా వుంటారనండి ఆడు బతుకుతాడని దీవించండి బాబూ! చేమ్మల మాటలే బెమ్మ దీవనలు - ఆడు సుకంగా బతికి మీ పాదాలకాడ మళ్లీ సాకిరీ సేసుకుంటాడు బాబయ్యా! మీరు ధనవంతులు. బూకా మందులు. తమ బోటి వోరికి అయిదు రూపాయిలు లెక్కేంటి బాబయ్యా! అప్పివ్వండి బాబూ! మళ్లీ తీరిసేత్తాం. మీకు నమ్మకం లేకపోతే కాగితం రాయించుకోండి. నేనూ మా మావయ్య ఏలు ముద్రవేస్తాం. మా కూలిగింజల్లోవి తీసుకుందురుగాని. ఇప్పుడు మీరు కనికరించకపోతే మాకు దిక్కెవ్వరు లేరు బాబయ్యా! మీ పాదాల బడి యేడుకుంటున్నా నా పెనివిటిని రచ్చించండి బాబయ్యా!' అంటూ ఏడుస్తూ దణ్ణం పెట్టింది -

'నా దగ్గరేం ఇప్పుడు డబ్బేం మీ కోసం మూట కట్టుకు కూర్చోలేదు. ఈ రోజుల్లో మహామహులంతటి వాళ్ళకే అప్పులు పుట్టడంలేదు...... మొన్న కోతలు కోయించుకోవడంతో ఇంట్లో వున్నా గింజాలన్నీ హుష్పీ మని ఎగిరిపోయాయి. ఇంకా మళ్లీ ముందుకు పన్లు చేయించడం ముందేవుంది. ఎల్లాగరా? అని నే నేడుస్తూంటే మీకు డబ్బు ఎల్లా యివ్వగలను? నా దగ్గర పని చేసేటప్పుడు మాత్రం ఒక్క పూట మీకు భత్యాలు అలస్యంగా యిస్తే నే నేదో ఎగ్గొట్టానన్నట్లు ఏడ్చేవాళ్లు కదూ? పో! ఇప్పుడు నా దగ్గర నీకేమీ దొరకదు' అంటూ దెప్పే వాళ్ళకి దేప్ప సందు అన్నట్లుగా ఆ నేపే మరీ కసిరికొట్టాడు గంగాధరం -

అంతలో ముసలాడు అబో దిబో మంటూ ఏడుస్తూ కర్ర పట్టుక అక్కడ కొచ్చి 'రత్తాలోయ్! ముసలోడు పిల్చినా మాట్లాడడం లేదేం?' అంటూ కోడలిని పట్టుక ఏడుస్తూ 'బాబయ్యగారూ! మా యింట్లో దీపం ఆరి పోకుండా కాపాడండి తండ్రీ! మా ఓడు నా కడుపుకి చిచ్చు పెట్టకుండా అయిదు రూపాయిలిచ్చిరక్షించండి' అంటూ గోడు గోడున మామ కోడళ్లిద్దరూ ఏడ్చారు-

'వాడికోసం ఇవ్వడానికి నేనేమీ బాకీ పడి వుండ లేదుకదూ!'

'బాబయ్యా! కడుపుని పుట్టిన చెట్టంత కొడుకు పొట్ట తీపి తెలిసిన వోరెవ్వరూ లేదనరు - కట్టుకున్న పెళ్లాం-దాని బాధ తెల్సుకుని మా యిల్లు నిలబెట్టండి. మీ ఋణం ఎల్లాగైనా తీర్చు కుంటాం బాబయ్యా! మా కిచ్చినంతట్లో మీకు భాగ్యం తరిగి పోదు' అన్నాడు ఏడుస్తూ ముసిలాడు -

గంగాధరం మనస్సు కాస్త చలించినా డబ్బుమీది కాంక్షతో మనస్సు గట్టి చేసుకుని 'నువ్వు నాదగ్గర కొచ్చి ఏడవక్కర్లేదు. నేను మీకు డబ్బు ఇవ్వదల్చుకో లేదు. మీ మాటలు మీ నిజాయితీ నా కనవసరం. ఫో ఇక్కడ నుంచి వెళ్ళిపొండి' అంటూ అరిచి తలుపు వేసుక లోపలి కొచ్చేశాడు.

గంగాధరం లోపలికి వచ్చేశాక వీధి అరుగుమీద కూర్చున్న నల్గురు కల్సి రత్తాలు ముసిలాడిని ఓ దారుస్తూ 'తా తా! మరేం భయపడక. అంతా తలో పావులా సర్దుతాం ముందు ఆడికి ఇంజేషను చేయించి బతికిద్దాం-నడు' అన్నాడు ఒకడు.

'గొడ్డు మోతౌడు - మళ్ళి సంచులకి సంచులు నిల వేస్తాడు. అదంతా ఎవడికోసం కూడబెడ్తున్నాడో? ఈడిని తగలెయ్యడానికి కూడా కడుపునో కొడుకన్నా లేదు మళ్ళీ' అంటూ పళ్ళు పటపట లాడించాడు రెండో ఆతడు.

'డబ్బు పిసినారోడికి కట్టం సుకం ఎట్టా తెల స్తాది? ఈయనదీఓ జల్మేనా ఏంటి? మన లాంటి వాళ్ళకి వచ్చేకట్టాలు ఈయనకి కూడా వత్తే అప్పుడు తెలుస్తాది అసలైన బాధ' అంటూ ఎవరికితోచిన మాటలు వాళ్ళు అంటూంటే ఆ ప్రక్కగదిలో లోపల నిల్చుని గంగాధరం భార్య మహేశ్వరి అంతా పూర్తిగా వింది. కళ్ళంట నీళ్ళతో గోడకు జేర్లాపడి పోయింది.

* * *

గంగారధరం తల్లి తండ్రులకు ఒక్కడే కొడుకు. వారింట్లో తాతల నాటినుంచీ పిసినిగొట్టు తనం వుంది. ఆతనికి ఇరవై ఏళ్ళు రాకుండాదే మహేశ్వరి కాపురాని కొచ్చింది. ఆమె కాపురాని కొచ్చిన పదేళ్ళకి గంగాధరం తల్లి తండ్రులు ఇహలోక యాత్రను చాలించారు. తండ్రిపోయాక రైతులు గంగాధరానికి శిస్తులు సరిగా యివ్వక ప్రతీయేటా బకాయి పెడ్తూండేవాళ్ళు. అయి దేళ్ళపాటు రైతులతో నానా అవస్థలూపడి చివరకి ఒక ఎకరం, భూమి విక్రయించి ఆ సొమ్ముతో స్వంత వ్యవసాయం ప్రారంభించాడు. ఆదివరలో బకాయిధాన్యాలు ఇవ్వాల్సిన రైతులంతా ఏమోవంకలు, కారణాలు కల్పించి చెప్పి పాత బాకిలన్నీ ఎగ్గొట్టి కూలిపన్లలోకి మాత్రం వస్తుండేవారు దాంతో గంగాధరానికి రైతుల మీద కోపం తారాకుండలానికి వెళ్ళింది.

తను ఒక్కడే కొడుకు కావడంచేత తన తల్లి తండ్రులు తనకి ఎక్కువ చదువు చెప్పించలేదు. అందుచేత ఉద్యోగానికి అనర్హుడయ్యాడు. ఇంక గత్యంతరంలేక కష్టించి భూమాతను సేవించి బ్రతకాలని నిర్ణయించుకుని వ్యవసాయంలో లీనమయ్యాడు.

కూలీలను పెంటేసుకుని వాళ్ళ సమానంగా పనితో చేస్తూ అవు మళ్ళు పోయించేవాడు. నాగలికట్టి ఎడ్లను తోలిముందుగా తనేదిగి కూలీలను హెచ్చరించి మోకాలి నీళ్ళలోపడి దుమ్ములిరిగేటట్లు కష్టించి దమ్ములు చేయిస్తూ తనూచేసేవాడు. ఊడ్పుల్లో ఒంచిన నడుం ఎత్తనాయకుండా పాదాలు మునిగే నీళ్ళలో కూలీల చేత దగ్గరుండి చేయించేవాడు. కలుపులు, కోతలు, నూర్పుళ్లు అన్నిపన్లూ కూడా ఎరమరిక లేకుండా తను చేస్తూ కూలీల చేత చేయిస్తూ వుండేవాడు.

కూలీలకు కొలిచే గింజల్లో న్యాయంగా యిచ్చేవాడు. ఒక్కపూట కూలి కూడా వాళ్ళకి ఎన్నడూ లోటు చెయ్యలేదు. ఎక్కువ ఇమ్మంటే మాత్రం ఏనాడూ ఇవ్వనూలేదు. గంగాధరానికి డబ్బు దగ్గర మాత్రం మొహమాటం, అభిమానం ఏమీలేవు. పరమ నిక్కచ్చి మనిషి ఎదుటివాళ్ళు బీదవాళ్లైనా సరే; ఎంతకష్ట పరిస్థి

తిలోవున్నా; ఎంత మనస్సు కరిగేటట్లు ఏడ్చినా తన చేతిలోది మాత్రం చిల్లుకానీ కూడా ధర్మం కాక పోయినా అప్పుగా కూడా ఇచ్చేవాడు కాదు. తనెల్లాగైతే ఇతరులకివ్వడో; అంతఖచ్చితంగానూ ఒకరిది తృణమైనా ఆశించడు. తానూ తనపొలము వ్యవసాయమూ అతనికి మరోసంగతి ఏమీ అక్కర్లేదు. తనని గురించి లోకం ఏమనుకున్నా సరే; లోకుల దూషణ భూషణలతో తనకీ సంబంధం లేదు. రాజకీయ విషయాలు రవ్వంత కూడా అతనికి తెలియవనే చెప్పవచ్చు - తన యిల్లు, తన ఊరు, తనపొలము వదలి అతడు ఒక్కరోజు కూడా ఎక్కడికీ కదలి వెళ్ళలేదంటే అతిశయోక్తి కాదు. తను ఇతరులతో ఎలావుంటాడో భార్య మహేశ్వరి విషయంలో కూడా అల్లాగే ప్రవర్తిసాడు. భార్యకి తిండికీ బట్టకీ యేనాడూలోటు చెయ్యక పోయినా వినోదాలకీ విలాసాలకీ ఖర్చు పెట్టుకోడానికి మాత్రం ఒక్కకానీ కూడా ఇచ్చేవాడు కాదు. తనకుతోచిన విధంగా నడిచే వాడేకాని భార్యకాదు కదా; బ్రహ్మ చెప్పినా వినేరకంకాదు గంగాధరం—

కష్టించి పనిచేసే గంగాధరం శ్రమఫలించింది. అదృష్టం కల్సి వచ్చింది - బాగా అనుభవమున్నా రైతుల కంటె రెండింతలు పండించాడు. తమ ఇంట్లోకి కూలి పన్నుకి సరిపోయే ధాన్యం వుంచుకుని మిగతావి అమ్మివేసి బ్యాంకులో దాచుకునేవాడు. ఏడాదికో రెండేళ్లకో ఒక్కొక్క ఎకరంభూమి కొని స్వంత వ్యవసాయాన్నివృద్ధి చేసుకొంటూ పది సంవత్సరాల్లో ఆస్థిపరుడు అనే మాట తెచ్చుకున్నాడు.

ఒక ఏడాది క్రితం వరకూ అతని జీవితం ఏలాంటి ఒడిదుడుకులూ లేకుండా, వృధా ఖర్చులు రాకుండా సాఫీగానే గడిచిపోయింది. కాని క్రిందటి సంవత్సరంలో అతని భార్య మహేశ్వరికి జబ్బుచేసి మంచం పట్టింది. తనకు భార్య తప్ప బంధువులు స్నేహితులు ఆప్తులు, హితులు ఎవ్వరులేకపోవడంచేత, తన సర్వస్వంగా చూసుకునే మహేశ్వరి మంచమెక్కడంతో తనలో కొంత మార్పువచ్చింది: భార్య వైద్యంకోసం, మందులకోసం మంచినీళ్ళ ప్రాయంగా ధనము ఖర్చుచేసి మహేశ్వరిని దక్కించుకున్నాడు. మహేశ్వరి శారీరకంగా ఆరోగ్యాన్ని కోలుకొంటున్నా, మానసికంగా బాగా క్రుంగిపోవడం ప్రారంభించింది. తర్వాగా గంగాధరంతో తన మనస్సులోని బాధనంతా చెప్పుకొంటూంటే వినే ఓర్పు ఆతనిలో కల్గినందుకే ఆమె సంతోషించింది—

భోజనంచేసే సమయంలో మాత్రం మహేశ్వరి చెప్పే మాటలన్నీ ఎంతో శ్రద్ధగా వింటూండేవాడు గంగాధరం - మహేశ్వరికి సంవత్సరంనుంచీ పట్టుకున్న బెంగ ఒక్కటే. తనకి నలభై ఏళ్ళు దాటాయి తన భర్తకి ఏభై ఏళ్ళు వస్తున్నాయి. తమకి పిల్లలులేరు తన భర్తకి డబ్బు పోగుచెయ్యడం, భూములుకొనడం, వ్యవసాయము చేసుకోవడము తప్పించి భవిష్యత్‌ను గురించి అణుమాత్రమైనా ఆలోచించడు. పోనీ; ఏదైనా తీర్థయాత్రలు దాన ధర్మాలు చేద్దామంటే అందుకూ సుతలామూ అంగీకరించడు. తమ ఆనంతరం ఈ ఆస్థి. ఈ ధనం, అంతా పరులపాలు కావల్సిందేనా? తాము చచ్చిపోయాక కనీసం తమ పేరును కూడా ఉచ్చరించడానికి ఎవ్వరూ వుండరా? తేనెటీగల్లాగ, చీమల్లాగ, తన భర్త కూడబెట్టిన ఈధనం తమ స్వంత సుఖానికి ఆనందానికి రవ్వంతకూడా వినియోగించుకోకుండానే తమ బ్రతుకులు ఆఖరైపోతాయేమో!...తన భర్త ఇంత ఆస్థిపరుడు ధనవంతుడు అనుకొని తృప్తిగా ఒక విలువైన చీరకూడా తను ఎన్నడూ కట్టుకోలేదు—

తను ఎక్కడికైనా పేరంటానికి, పెళ్ళిళ్ళకి వెడ్తే పిసినిగొట్టు గంగాధరం భార్య, లోభివాని యిల్లాలు, గొడ్రాలు' ఇత్యాది బిరుదాలన్నీ తనకి ఇస్తూంటే భరించ శక్యముకాని బాధపడ్తూ భర్తకి చెప్పుకునేది.

అన్నీ విన్న గంగాధరం 'పోన్లే! ఎవరు ఎల్లా అనుకొంటే మనకేంకదా!' అని తేలిగ్గా అనేసేవాడు.

అంతకీ ఆమె మనస్సులో వుండబట్టలేనప్పుడు 'నలభై ఏళ్లు నెత్తికొస్తున్నా ఓ పుణ్యం పురుషార్థం అంటూ ఏమీ అక్కర్లేదు. ఎంతసేపు ఎల్లా డబ్బు పోగుచేసుకుందామా? అనే ఆరాటంతప్ప అది అనుభవించేవారెవ్వరూ? అన్న ఆలోచన నేను బ్రతికుండగా ఇంక మీకు జన్మలో రాదు' అంది ఓనాడు.

ఆరోజు భోజనాలదగ్గర గంగాధరానికి మహేశ్వరికి మాటమీద మాటపెరిగి తన మనస్సులోని కోపాన్నంతా వెళ్ళగక్కింది ఆమె.

అన్నీ విన్న గంగాధరానికి అభిమానం, కోపం, పౌరుషం ముంచుకొచ్చి 'అలాగైతే నీకంత పుణ్యం కావాలని చచ్చేటంత కోరికే వుంటే ఓ వంద రూపాయి లిస్తా-ఎవరైనా యాత్రకి వెడ్తూంటే వాళ్లతో కలిసి వెళ్లు. అంతేకాని నేనుమాత్రం రాలేను' అంటూ కోపంగా లేచివెళ్ళి ఇరవై అయిదు రూపాయిల నోట్లు తెచ్చి మహేశ్వరికిచ్చాడు.

గుళ్ళోకి వెళ్ళడానికి దేవుడి దక్షిణకోసం ఒక్క కానీ ఇవ్వని తన భర్త ఒక్కసారిగా వంద రూపాయిలు యిచ్చేసరికి ఆశ్చర్యపోతూ ఇంకోక్షణం అది ఆయన కళ్ళకి కన్పిస్తే మళ్ళీ ఏవిధంగా మనస్సులో మారుతుందో అని కిక్కురుమనకుండా తీసుకెళ్ళి పెట్లో భద్రంగా దాచుకువచ్చింది మహేశ్వరి.

ఆ డబ్బుతో మహేశ్వరికి కాశీ వెళ్లాలని ఉంది. కాశీ వెళ్ళివచ్చిన యాత్రికులను అడిగింది ఖర్చు వివరాలన్నీ-కానీ కాశీ వెళ్ళడానికి వంద రూపాయిలు చాలవనియూ, శ్రీశైలం యాత్రకైతే స్వేచ్ఛగా ఖర్చుపెట్టుకున్నా సరిపోతాయని సలహా యిచ్చారు ఆ యాత్రికులు. శ్రీశైల శిఖరం చూచినాకాని పునర్జన్మ లేదన్నప్పుడు శ్రీశైలక్షేత్రమే దర్శించినవాళ్లకి ఇంకా ఎంతటి పుణ్యం లభిస్తుందో! అని తల్చుకు ఉప్పొంగిపోయింది.

మహాశివరాత్రి ముందు అందరితోనూ కలిసి బయలుదేరి వెళ్లాలని మనసా నిశ్చయించుకుని మూట ముల్లెకూడా కట్టుకొని ఆ వెళ్ళేరోజు కోసం ఎదురుచూస్తోంది-మహేశ్వరి.

(సశేషం)

---

ఆఫీసరు: ఏంరా ప్రొద్దెక్కి వచ్చావ్.

కొత్త బంట్రోతు: ప్రొద్దెక్కి రాలేదు, నడిచే వచ్చానండి!

ఆఫీసరు: బాగుంది నీ జవాబు కాని, అమ్మగారి వద్దకెళ్లి కూరలు ఏంకావాలో కనుక్కు-నిరా.

కొత్త బంట్రోతు: రాత్రి చేసిన గోంగూర పచ్చడి వుందని చెప్పిందండి మా అమ్మ.

ఆఫీసరు: మీ అమ్మను కాదురా ఫూల్! నా భార్యను.

కొత్త బంట్రోతు: మాలో భార్యను అలా చెప్పుకుండి క్షమించండి.

– జి. వరదరాజు, బొంబాయి.

మెట్రిక్ తూనికలు, కొలతలు మాత్రమే చట్టసమ్మతమైనవి
గజములలో క్రయవిక్రయాలు చేయవద్దు.



మీటర్లలో
మాత్రమే కొనండి

DA 63/442

# అంత్య సందేశం X

రచన:
శ్రీమతి పరానేని శ్రీశైల భ్రమరాంబ.

(గత సంచిక తరువాయి)

ఇంక మహేశ్వరి శ్రీశైల యాత్ర వెళ్ళడానికి వారం రోజులు మాత్రం వుంది. సరిగ్గా ఈ రోజు ప్రొద్దున్నే వీధిలో జరిగిన సంభాషణ రత్తాలు, ముసిలాడు ఏడుస్తూ చెప్పడం, తన భర్త ఇవ్వనని తల్పు వేసుకోడం, వాళ్ళంతా వెళ్ళిపోతూ అన్న మాటలు తను చెవులారా వినేసరికి మనస్సు శతవ్రక్కలైంది.

'గొడ్డుమోతోడు. మళ్ళీ సంచులకి సంచులు నిలవేస్తాడు. అదంతా ఎవడికోసం కూడబెడ్తాడో! యీణ్ణి తగలెయ్యడానికి కూడా కడుపునో కొడుకన్నా లేడు మళ్లీ' అనివాళ్ళు అన్న మాటలు మహేశ్వరి చెవుల్లో గింగురుమనిపిస్తున్నాయి.

'డబ్బు పిసినారోడ్డోకి కట్టసుఖం ఎట్లా తెలుస్తాది?' అని వాళ్ళన్న మాటలు ప్రతిధ్వనిస్తున్నాయి తన చెవులకి-

పెందరాళే భోంచేసి పొలం వెళ్ళిపోవాలని తొందర పెట్టిన గంగాధరానికి అన్నం వండి పెట్టింది. 'రత్తాలుకి ఒక్క అయిదు రూపాయిలిస్తే మీకేమంత గొప్ప నష్టమొస్తుంది?' అంది ఆమె,

'ఆ విషయాలు నీకు అనవసర ప్రసంగం' అన్నాడు కోపంగా ఇంకేమీ మళ్ళీ అనలేకపోయింది-

అతడు భోజనం చేసి సాయంత్రంవరకూ రానని చెప్పి పొలం వెళ్లిపోయాడు. తనకి మాత్రం అన్నం తినబుద్ధి కాలేదు. వీధిలో కొచ్చేసరికి ఎదురింట్లోంచి రేడియో సంగీతం వినిపిస్తోంది సన్నంగా. 'నీలో నున్నా దేవుని గానక తీర్థ యాత్రలను చేయకుమురా...'

ఈ సంగీతం అగ్నికి వాయువు తోడైనట్లయింది తన మనస్సుకి. తనే స్వయంగా వెళ్ళి రత్తాలు భర్త ఎలా వున్నాడో చూచి రావాలనుకొని పనిమనిషిని వెంట బెట్టుకుని వాళ్ల గూడెం వెళ్ళడానికి బయల్దేరింది. మహేశ్వరి దాసీమనిషి వద్దని ఎన్నో విధాల చెప్పినా స్వయంగా చూచి వాళ్ళ పరిస్థితి తెల్సుకుంటేనే గాని నా మనస్సుకి శాంతిలేదని మహేశ్వరి చెప్పి పనిమనిషి వల్ల దోవ తెల్సుకుంటూ కాలినడకనే వెళ్లిందిమహేశ్వరి-

మహేశ్వరి పుట్టాక గూడెం ఎల్లా వుంటుందో చూడలేదు. వాళ్ల ఇళ్ళు ఎల్లా వుంటాయో? అనుకుంటూ గూడెంలో అడుగుపెట్టింది ఆమె. ఆ ఇళ్ళు, ఆ మట్టి గోడలు, కొన్ని వెదురు గోడలు, చివికి సిద్ధిలమైపోయిన ఇంటి పైకప్పులు, అస్థిపంజరాల్లా వెదురు పెణకలతో కన్పించే గుడిసెల గూడెం. పాత చింకి గుడ్డలు...మానహాని మాత్రం రాకుండా ఏదో చిన్న గుడ్డ పీలికలు అడ్డుకట్టుకున్న ఆ స్త్రీలు. కృశించిపోయిన మానవ శరీరాలతో, చిన్న గోచీ పాతలతో అల్లా తిరిగే వృద్ధులూ, బాలురూ, యువకులూ, మార్గమున కడ్డుగా పెంటకుప్పలు, మురికి. అబ్బా! ఎంత దిక్కులేని దీనులు అనుకుంది. వాళ్ళ జీర్ణ నిరుపేద కుటీరాలు. కడుపుకు అన్నమైనాలేక గంజి నీళ్ళతో బ్రతికే నిరాధార జీవులు. ఆహా! లోకంలో దీనులు దరిద్రులు అంటే వీరేగాబోలు అనుకొంది. తిన తిండి కట్టగుడ్డ లేని అభాగ్యులు. ఆ దీనులను, దుఃఖితులను ఇంక చూళ్లేక పోయింది మహేశ్వరి. ఒకరోజు అన్నంతింటే మూడురోజులు గంజి. మిగతా రోజులు పస్తులు వారానికి-మనుష్యాకారంతో గాలి బ్రతుకు బ్రతికి నీళ్ళతో కాలం గడిపే నిర్భాగ్యజీవులు. పాపం! వాళ్ళకు తిండివుంటేకదా కండ వుండేటందుకు? అయ్యో! పాపం!! అనుకొంటూ అల్లాగే చూస్తూ నిలుచుండిపోయింది ఆమె. నిజంగా కూలివాళ్ళను, వాళ్ళ కష్టాల్ని, వారి దంత దుర్భర దారిద్ర్యాన్ని అర్థం చేసుకోనేలేరా ఈ ధనికులైన మానవులు? అనుకొంటూ అల్లానే నిల్చుండిపోయింది అన్నీ ప్రత్యక్షంగా చూస్తూ ఆమె.

మళ్ళీ కొంచెం ముందుకు నడిచింది. సరిగ్గా రత్తాలు గుమ్మం ముందుకువచ్చి పక్కన ఆగిపోయింది మహేశ్వరి. పొట్టమీదకు కూడా సరిగ్గా బట్టలేని నిండు గర్భిణీ స్త్రీ రత్తాలు. చిన్న గోచీతో కటిక నేలమీద పడుకున్నాడు ముసిలాడు. నులకకుక్కి మంచంలో రత్తాలు భర్త కొనఊపిరి తీసుకుంటూ ఒంటిమీద చిరుగులతో సగం వరకూ కప్పబడిన గుడ్డలో పడివున్నాడు. పిల్లలు కొంచెం గంజి త్రాగుతూ చాలలేదని ఏడుస్తున్నారు. ఈ దృశ్యమంతా ఆమె గుండెల్లో పాతుకు పోతూంటే

అల్లాగే చూస్తూ నిలబడిపోయింది కళ్ళంట నీళ్ళతో. పెద్ద యింట్లో కూర్చుని గొంతుక వరకూ పీకలు మెయ్యా మెక్కి త్రేవ్‌మని త్రేన్చే తనకి ఆ బీదల స్థితి ప్రత్యక్షంగా కన్పిస్తూంటే...ఎండకు ఎండి, చలికి ఒణికి, తిన తిండి, కట్ట గుడ్డకూ కరువయ్యే ఈ కష్టజీవుల్ని ఇంక చూడలేక కళ్ళు మూసుకుని గబగబా వెనక్కి తిరిగి వచ్చేసింది.

తిన్నగా వచ్చి గుమ్మంలో అడుగు పెట్టినా కాని మహేశ్వరికి ఆ గూడెం, అక్కడి మానవులు కళ్ల ముందు ప్రత్యక్షంగా యుండే సరికి తల్పుతీసి లోపలికి వచ్చి మంచంమీద పడి ఘోరున ఏడ్చింది వాళ్ల దుస్థితిని మాచుకుని తల్చుకుని. తనతో వచ్చిన దాసీ దానివల్ల అక్కడి వాళ్ళ వివరాలన్నీ తెలుసుకుంది మహేశ్వరి,

రత్తాలు దీనంగా వేడుకోవటం—వాళ్ళు తన భర్త గంగాధరాన్ని అన్న మాటలు—ఆ గూడెం—రత్తాలు ఇల్లు—ఒక్కొక్కటే తల్చుకునేసరికి గుండె పగిలి పోతోంది మహేశ్వరికి. దాసీదాన్ని పిలిచి ఓ పాతిక రూపాయిలు ఆమె చేతికి యిస్తూ 'నువ్వు త్వరగా ఆ రత్తాలు యింటికివెళ్లి ఈ డబ్బు ఆమె చేతికి యిచ్చి నీ భర్తను త్వరగా బ్రతికించుకో అని చెప్పిరా' అంటూ తొందరగా పంపించింది.

అయినా మహేశ్వరికి మనశ్శాంతిలేదు. ఆ బీదల పాట్లు, రత్తాలు కన్నీళ్ళు, తన శరీరంలో ప్రతీ అణువు లోనూ భగభగ మండే అగ్ని జ్వాలలా లేవదీశాయి వాళ్ల బాధలు. వాళ్లు అన్నమాటలు అన్ని ప్రక్కల నుంచీ ఇనుప కమ్ముల్లా కొడ్తున్నాయి తన మనిస్సుకి. ఆ రత్తాలు దుఃఖంతో ప్రాదేయపడ్డ తన గుండెల్లో గూండ్రిస్తోంది. ఆమె మనస్సు గూడు విప్పిన పక్షిలా ఎగురుతోంది. వెక్కి వెక్కి ఏడుస్తూ మంచం మీద పడుకుంది మహేస్వరి.

తన భర్తకి ధనం మాత్రం వుంది. ఇతరుల సొమ్ము విషంలా చూస్తాడు...కాని అందువల్ల మంచివాడనిపించుకోలేక పోతున్నాడు. అతని ప్రవర్తన లోకుల దృష్టిలో అసహ్యంగా కనిపిస్తోంది. నన్ను ముట్టుకోకు నామాలకాకి అన్నట్లు బ్రతకాలంటే ఎల్లా సంఘంలో చెలామణి అవగలడు?—తనకి వార్ధక్య లక్షణాలు వస్తున్నాయి. ఎవ్వరితోనూ పొత్తులేకుండా తన బ్రతుకు గడిచేదెలా?—ఏమైనా సరే తన భర్త మనస్సు మార్చి బీదవాళ్ళమీద దయాదాక్షిణ్యాలు కల్గేలా చెయ్యాలని మనస్సా నిశ్చయించుకుంది మహేశ్వరి.

ఆ రాత్రి మహేశ్వరి భర్తతో బీదవాళ్ళ అవస్థను గురించి చెప్పింది. వాళ్ల కేనాటైనా కొంచెం సహాయం చేసి మానవత్వాన్ని చూపించమని ప్రాధేయపడి అడిగింది.

అదంతా విన్నాక గంగాధరం ఈమె ఆ గూడెం ఎందుకు వెళ్లిందిరా భగవంతుడా అని మనస్సులో అనుకొని విరిగి పోయిన యిటుక ముక్కలా ముఖం ప్రక్కకు తిప్పి గుర్రాలక్కి మూతిలా వంకరగా త్రిప్పుతూ, వాళ్ళ కర్మకి మనమేం చేస్తాం? వాళ్ళు దరిద్రం అనుభవిస్తూ కన్నీరె కార్చడానికే పుట్టారు. అదీకాక అల్ప జాతి వాళ్లకి కడుపునిండా కూడుంటే మనకి లొంగుతారా? ఒకవేళ వాళ్ళు నేనిచ్చిన డబ్బు ఇవ్వకుండా చచ్చిపోతే?—ఆ నష్టం ఎవరు భరాయిస్తారుచెప్పు? అంటూ పెద్ద తీర్పుయిచ్చాడు జడ్జిలా?—

ఆ మాటతో మహేశ్వరి మనస్సు చివుక్కుమంది. ఎల్లాగైనా భర్తకు నచ్చజెప్పి మంచిగా చేసుకోవాలని 'అదేమిటండీ? మనం మాత్రం ఇదంతా కూడబెట్టి ఎవరికివ్వాలి.? ఆవాలుముద్ద చేసి ఓ దత్తపుత్రుణ్ణి పెంచుకుని వానికిచ్చినా మన కళ్ళముందే అదంతా తగలేస్తాడు. అప్పనంగా వచ్చిన సంపద కాబట్టి పోనీ అలా కాకుండా మనమే భద్రంగా దాచినా కాని 'మనం ఎప్పుడు చచ్చిపోతామా? ఆస్తిమనకు ఎప్పుడు వస్తుందా? అని కాష్టం మీద గ్రద్దల్లా రాబందులవంటి బంధువులైన ఆస్తికి వారసులైన బంధువులు ఎదురు చూస్తూంటారు. అటు వంటప్పుడు మనం అనుభవించక ఒకరికి ఏమీ చేతులారా పెట్టక ఎన్నాళ్లు కూడబెట్టడం? మనకి పెద్దతనం వస్తోంది. కాస్త పేరు ప్రఖ్యాతి, పుణ్యం, పురుషార్థం అక్కర్లేదా?' అంటూ ఎంతో వినయంగా, విధేయతగా చెప్పింది,

ఈ మాటలు విని గంగాధరం మనస్సులో బాధ పడ్తూ కొంచెం సణుగుడుగా 'మళ్ళీ ప్రారంభించావ్ వెధవపోరు. నా డబ్బుచూస్తే నీకూ కళ్ళు కుడ్తున్నా

రేమో! డబ్బు ఖర్చుపెట్టే మాట తప్పించి ఇంకేమైనా వింటా' అన్నాడు.

'అదేం మాటండీ? ఏదైనా ఓ సత్కార్యం చేస్తే ప్రజలకు మేలుచేసిన వారమవుతాము. మీకూ శాశ్వతమైనకీర్తి. మీ పేరు ఈ ఊళ్ళో తరతరాల నిలబడేలా ఏదైనా ఓ ఆస్పత్రి కట్టించండి. బీదవాళ్లు పిల్లల గలవాళ్లు ఊరివారంతా సుఖపడ్తారు. మీకుమాత్రం ఎవరున్నారు. మనకి పిల్లలు లేకపోయినా శాశ్వతమైన చిరస్థాయిగా మనపేరు నిల్చిపోతుంది.' అంటూ ఎంతో నమ్రతగా చెప్పింది మహేశ్వరి.

'అల్లాంటి అనవసరం పన్ను నెత్తిమీద పెట్టుకోడానికి నేనంత చవట వెధవనికాను' అన్నాడు కోపంగా.

'అదేం మాటండీ? ఆస్పత్రి కట్టించడమంటే ప్రజాసమూహానికంతకీ పనికివచ్చేపని. ధర్మ జిజ్ఞాసతో ఇల్లాంటి సత్కార్యం చెయ్యడానికి మనకు తాహతులేకపోలేదు కదా?'

'ఈ ఊళ్ళో ఎవరికీ లేని బాధ మనకెందుకు?'

'మీ రొక్కరు ముందుగాపైకి వచ్చి కొంత ఖర్చుచేస్తే మీలాంటి భూమిగల ధనవంతులు అంతా మీ వెనకాలే వస్తారు. అంతేకాని ఐశ్వర్యం పెరిగిన కొద్దీ ధర్మచింత నశించి, స్వార్థబుద్ధితో అందురు, మీకుమల్లె కూడగట్టుకు కూర్చుంటే మన వూళ్ళో వైద్య సహాయం లేక ఎందరో ఎన్నో కష్టాల పాలవుతున్నారు' అంది ఆతనివైపు ఆశగా చూస్తూ ఆమె.

'ఆ శూద్ర వెధవలకోసం నా కష్టార్జితమంతా తగలబెట్టి ఆస్పత్రి కట్టించాలనా నీ దురుద్దేశం?' తీవ్రంగా అడిగాడు గంగాధరం-

మీరలా అంటారేకాని మీ అంత దైవచింతన కలిగిన ధర్మదాత, సౌమ్యుడు, విశాల హృదయులు, ఎవరున్నారు చెప్పండి మన ఊరి మొత్తంలో- మీరు పట్టుదల వహిస్తే ఎంతటి పనైనా సాధించగలరు. (అంటూ గ్యాసు కొడ్తూ) చూడండి మీతో సమానంగా పంటలు పండించే వ్యవసాయకులు మన ఊళ్ళోనే కాదు; మన జిల్లాలో కూడా ఎవరైనా ఉన్నారా? మీరు మనస్సాతల్చుకుని చెయ్యాలని పూనుకుంటే ఆ కీర్తి పుణ్యమూ మీకే దక్కుతుంది. మనపొలంలో చక్కని విశాలమైన ప్రదేశంకదా! అక్కడ ఓ ఆస్పత్రి, స్కూలు బిల్డింగు కట్టిస్తానంటే మన ఊరంతా మీకు కల్సివస్తారు. గవర్నమెంటుకి దరఖాస్తు పెట్టుకుంటే టీచర్సుని, డాక్టరుని వేస్తారు. మన కీర్తి తరతరాలా నిల్చిపోతుంది. మన బ్రతుకులంటారా? మీరు వ్యవసాయంచేసి కావల్సినంత పండిస్తారు. ఎవరి భూమి కవులుకు తీసుకున్నా మనిద్దరి పొట్టలూ గడిచిపోతాయి.' అంటూ అతని మనస్సుకి ఉత్సాహం కలిగించాలని ఎంతో హుషారుగా చెప్పింది జగదీశ్వరి.

ధనకాంక్షగల స్వార్థపరుడైన గంగాధరానికి ఈ మాటలు మనస్సుకి పట్టక పోగా నిరుపయోగమైన సంభాషణలా తోచి. ఆమెను ఎల్లాగైనా ఈ దృష్టినుంచి ఇటువంటి మాటలనుంచి తప్పించాలని 'మహేశ్వరీ! నువ్వేదో ఊరునంతా ఉద్ధరించాలన్నట్లు మాట్లాడ్తావ్. ఈ ఊళ్లో కూలి వెధవలు ఎంత ఖచ్చితంగా నేను కూలి యిచ్చినా సమయానికి పనిలోకి ఒక్కడూ రాడు. అల్లాంటి వాళ్లకోసం నేనెందుకు ఖర్చుపెట్టాలి? నా మాటయందు విలువ ఉంచని ఈ ఊళ్ళో వాళ్ళకోసం నా స్వార్జితాన్ని చిల్లుకానీ కూడా దుర్వినియోగం చెయ్యదల్చుకోలేదు' అన్నాడు నిక్కచ్చిగా.

'మీరు ఎవరి కష్టసుఖాలకీ అదుకోకపోతే; నల్గురితోను కల్సిమెల్సి తిరగకపోతే మీ మీద వారికందరికీ గౌరవం ఎలా వుంటుంది? అందరి దగ్గిరా పలుకుబడి సంపాదించాలంటే, మీ కఠినత్వం, ధనకాంక్ష కొంచెం తగ్గించుకుని 'ఒంటెత్తు మనిషి' అన్న అపనింద పోగొట్టుకుంటే తోటి యీనాందార్లు, గ్రామం రైతులు తర్చుగా మిమ్మల్ని పలకరిస్తూనూ వుంటారు.; కనీసం మీరు కనిపించి నప్పుడైనా గౌరవ చిహ్నంగా ఓ నమస్కారమైనా చేస్తారు కూలివాళ్లు. అంతేకాని మీ రెవ్వరికీ రవ్వంత ఉపకారం, సహాయం చెయ్యక పోయినా మిమ్మల్ని అంతా గౌరవించాలంటే—అది ఏ నాటికీ సాధ్యంకాదు మీకు. ఇన్నాళ్ల వరకూ మీరెలా వున్నా ఇప్పటో యాభైవేలు ఖర్చుపెట్టి. ఓ ఘనకార్యంగా ఆస్పత్రి, స్కూలు బిల్డింగు కట్టించండి. ప్రజలేకాకుండా ప్రభుత్వం కూడా మీకు బ్రహ్మరథం పడ్తారు. మీకు కావల్సినంత హోదా, పలుకుబడి రావడమే కాకుండా మనం చచ్చిపోయినా మనపేరు బ్రతికే ఉంటుంది. ప్రజల నోట్లో ప్రతి నిత్యం—అంటూ చిన్న [illegible]

పాఠం చెప్పినట్లుగా బాగా బోధపడేటట్లు చెప్పింది మహేశ్వరి.

'నీకేమైనా మతిపోయిందేమిటి మహేశ్వరీ! ఈ ఊళ్ళో రోగిష్టివాళ్ళందరికీ ఆస్పత్రి కట్టించడానికి. కూలి పేదవాళ్ళ అందరికి చదువుకోసం స్కూలు కట్టించడానికి నీ కళ్ళకి నేనొక్కణ్ణే కన్పించానన్నమాట? ఈ ఊళ్ళో నా కంటే ధనికులు కావల్సినంత మంది వున్నారు. వాళ్లందరి పెళ్ళాలు ఇల్లాగే వేధించుకు తింటున్నారా?'

'మీరల్లా ఎన్నడూ అనుకోకండి - ధర్మ కార్యం చెయ్యడం మొదలెడితే అంతా ముందుకు వస్తారు. మనం నీతిపరులం: హెచ్చు ధనికులం వాళ్ళం కావడంచేత ఆ కార్యముకు ముందు బాధ్యత మీరు వహిస్తే అసలైన ఘనకీర్తి మీకే వస్తుంది - శ్రీమంతులైనవారంతా తలో వెయ్యి వేసుకున్నా మన ఊరికి అన్ని సౌకర్యములు ఏర్పడ్తాయి' అంది ఎల్లాగైనా భర్తచేత ఒప్పించాలనే పట్టుదలతో -

'నా ప్రాణానికి నువ్వొక్కతెవే దాపరించావే శనిదేవతలా? హాయిగా అన్నీ తెచ్చి పడేస్తూంటే తిని కూర్చోలేక పేదల గోడ వెందుకు నీకు; ఊరంతా నా ఒక్కడి చేతా మరమ్మత్తు చేయించాలని చంపేస్తున్నావేమిటి?' అంటూ చివాలున లేచి కోపంతో ఆ నేసి వీధులోకి వచ్చేశాడు గంగాధరం -

మహేశ్వరి గ్రుడ్లునీరు క్రక్కుతూ మంచంమీద ఆలోచిస్తూ పడుకుంది. ఏ విధంగా చూచినా తనకీ తన భర్త గంగాధరానికే అన్నింటిలోనూ విరుద్ధాభిప్రాయాలే - తమకుందే ధనమంతా నామరూపాలు లేకుండా ఇతరులు.జన్మలో ధంసంధంలేని వాళెవరో వచ్చి ఆక్రమించుకో వల్సిందేనా? ఇంక ఈ ధనం తమచేతులతో స్వయంగా సద్వినియోగం చేసుకునే అదృష్టం తన భర్త పెట్టి పుట్టలేదా?......"మైనా సరే తను బ్రతికుండగానే భర్త చేత" ఏదో మహోత్కార్యాన్ని చేయించాలనే మనస్సా నిర్ణయించుకుంటూ ఆలోచిస్తూ పడుకుంది మహేశ్వరి -

గంగాధరం డబ్బుయందుగల మమకారాన్ని వదులుకోలేక భార్యతో కలహం తెచ్చుకోడానికీ మనస్కరించక, ఎటూ తోచక వీధి అరుగు మీద పచార్లు చేస్తున్నాడు. తన భార్య చెప్పినట్లు చెయ్యాలంటే తను యిన్నాళ్లూ చెమటూడ్చి గడించిన ధనమంతా రెక్కలొచ్చినట్లు ఎగిరిపోతుంది...... పోనీ మాన్పేద్దామంటే మహేశ్వరి చెప్పడంలోని పట్టుదలచూస్తే...ఆమె తన జీవిత కాలమంతా పోరాడేటట్లు కన్పిస్తోంది...చివరికితన కోచక్కని ఆలోచన తట్టింది - మహేశ్వరికి ఇంకో వంద రూపాయిలిచ్చి ఏ కాశీయో! రామేశ్వరమో పంపిస్తే ఓ నెల రోజులు తిరిగి వస్తుంది - ఆ భక్తి ధోరణిలో పడిపోయి ఇంక మళ్లీ యీ మాట మర్చిపోవచ్చు 'అనుకొని మెల్లిగా లోపలికి వచ్చి మహేశ్వరి దగ్గర కొచ్చి ఇంకో వందరూపాయలిస్తా - నెల్లాళ్ళు అన్ని యాత్రలు చేసుకో అనిచెప్పాడు' గంగాధరం -

'నేను ఒంటరిగానూ మాత్రం ఎవ్వరితోనూ కల్సి తీర యాత్రలకు వెళ్ళదల్చుకోలేదు. నేను యాత్రలు చెయ్యడం నిజంగా మీ మనస్సుకి ఇష్టముంటే మీరే రండి నిద్దరం కల్సి అన్ని యాత్రలు చేసుకొద్దాం - అందువల్ల మనిద్దరికీ ముక్తి మోక్షం కూడా వుంది. అంతేకాని మీరు దగ్గర లేకుండా నా కెల్లాంటి పుణ్యం అక్కర్లేదు' అని నిక్కచ్చిగా చెప్పింది మహేశ్వరి -

ఇంక ఏమీ కిక్కురు మనలేక సోయూడు గంగాధరం భార్య తప్ప తనలోకంలో 'నా, అన్నవారెవ్వరూ లేరు. ఆమె తనని ఏ విషయంలోనూ ఎన్నడూ నిర్బంధించి ఏమీ అడగలేదు. తను ఆమె కోసం ప్రత్యేకించి ఏమీ చెయ్యక పోయినా 'ఇదేమిటి? ' అని కూడా అనలేదన్నడూ - తను ఎంత చవుకబారు చీరలు తెచ్చినా, 'నచ్చలేదు' అని కూడా చెప్పలేదు. పదిహేను ఏళ్ళ వయస్సులో తన భార్య తన యింటి కొచ్చింది కాపురానికి - ఈ నాటివరకూ తన మాట కెన్నడూ ఎదురు జవాబివ్వలేదు - ఆమెకి చిన్నప్పుడే తల్లితండ్రులు కరువు కావడం చేత తనని వదలి కూడా ఎన్నడూ ఎక్కడికీ వెళ్ళలేదు ఈ రోజు ప్రొద్దున్నే ఈ రత్తాలు వచ్చినప్పటి నుంచీ మాత్రం ఈమె యిల్లా మారిపోయింది... ఎల్లాగైనా మహేశ్వరితో మంచిగా చెప్పి మామూలు సంభాషణలోకి తెప్పించాలనుకున్నాడు.

'మహేశ్వరి! నువ్వేవో అనవసర విషయాలకోసం పట్టుదల వహిస్తున్నావు కాని; నిజంగా వ్యవసాయంలో వరదలవల్ల పెద్ద ఏరులు పొంగి ఎన్నోసార్లు పంటలు నష్ట

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

మైపోతున్నాయి - ఆ ఏరును గురించే కట్టుబాటు లేదు మన వూళ్ళో! ఊటికి ఎగరలేనమ్మ స్వర్గానికెగురుతానా? అన్నట్లు ఏటికి ఎత్తుగా గట్టు వెయ్యడానికి కూడా ఎవరికీ పట్టనప్పుడు మిగతా గొడవలు మన కెందుకు చెప్పు?' ఎంతో నెమ్మదిగా అన్నాడు గంగాధరం.

'అదీ నిజమే అనుకోండి. ఏటేటా వరదలు వచ్చి భూములకు కలిగే నష్టం అందరితో బాటూ మీకూవుంది నిజంగా చెప్పాలంటే ఈ ఊళ్ళో అందరి కంటే మీకే ఎక్కువ భూమివుంది- అటువంటప్పుడు గ్రామంలో వుండే రైతులందరితోనూ మీరూ ఏకీభవించి మీ వ్యవసాయికుల కష్టాలన్నీ చెప్పుకుంటూ గవర్నమెంటు వారికి మహజర్లు పెట్టుకుంటే వాళ్లు ఓ కలెక్టరునో, తాసీల్దారునో పంపించి భూములన్నీ తనిఖీ చేయించి కొంత సొమ్ము మీరిచ్చుకుంటానంటే మిగతాదంతా గవర్నమెంటువారే వేసి మీకు ఉపయోగంగా చేయిస్తారు. అంతేనే కాని మీరు ఎవరితోనూ కలిసి రాకపోతే ఆ నష్టం మీకే కాకుండా ఊరందరికీ కూడా తప్పడంలేదు ఇల్లాంటి సంగతులన్నీ నాకు ఎందరో చెప్పారు - కాని మీతో చెప్పినా కాని మీరు వినేరకం మనిషి కాకపోవడంచేత. ఎన్నడూ చెప్పడానికి సాహసించలేకపోయాను' అంది. 'మనకి ఏదైనా చిన్న పని కావాలని కోరితే మా దగ్గర సర్కారు వారు డబ్బు తీసుకు చెయ్యకపోరు?......అదీకాక పన్నులంటూ మా దగ్గర నుంచి వేలకు వేలు గుంజుకొంటున్నారు. ఈ సర్కారు వాళ్లు గట్టుకోసం కూడా మళ్ళీ మమ్మల్ని కొంత సొమ్ము వేసుకోమంటే ఎక్కడిచ్చుకో గలం?' అన్నాడు పెద్ద సమస్యగా గంగాధరం.

'ఏ వూరికి కావల్సిన పనుకి ఆ గ్రామస్తులే కొంత ఖర్చుపెట్టుకు బాధ్యత వహించకపోతే, మొత్తం అన్ని తాలూకాల బాధ్యత వహించే ప్రభుత్వానికి మాత్రం తగినంత ధనం ఉండొద్దా? అలాక్కాకుండా అన్నీ కూడా పన్నులు పుచ్చుకునే ప్రభుత్వమే చెయ్యాలంటే అందుకు ఎన్నో సంవత్సరాలు ఆలస్య మవుతుంది. ఈ లోగా అనేక సార్లు నష్టాన్ని పొందవల్సిన వాళ్ళు రైతులు. భూ ఖామందులే కదా! పరమ పవిత్రమైన, పూజ్యమైన భూమాత మిమ్మల్ని అనుగ్రహింప బట్టే కదా మీకు రావల్సిన దానికంటె రెండు రెట్లు పంటను పొందగలుతున్నారు. అటువంటప్పుడు ఏటి గట్టును ఎత్తు చేయించుకోడానికి మీ మటుక్కు మీరో వెయ్యి రూపాయిలైనా కనీసం ఖర్చుచేయడమే న్యాయంకదా! ఆ విధంగానే ఎవరికుండే భూమిని బట్టి వాళ్ళు వారి తహతుకు సరిపోయే డబ్బు వేసుకుంటే అసాధ్యమైన పనేముంటుంది.?' అంటూ సలహా చెప్పినట్లుగా అంది మహేశ్వరి.

చాలా రాత్రివరకూ మహేశ్వరి గంగాధరం ఇల్లాగే ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు. ఇంత వరకూ మహేశ్వరి ఎన్నడూ ఇటూవంటి విషయాలు చెప్పడం గాని, సలహా రూపంలో బాధ్యత తీసుకు భర్తకు విశదీకరించడంగాని ఎన్నడూ లేదు. అయినా ఈ నాడు రత్తాలు వచ్చిన సంఘటనతో, గూడెం వెళ్ళి వచ్చాక ఆమెలో పిరికి దనం మాయమై. ఎంతో ధైర్యం, ఒక విధమైన పట్టుదల కల్గాయి. దాంతో 'కరణేషుమంత్రీ' అన్నట్లుగా అడిగిన వాట్లకే కాకుండా అడగని విషయాలకి కూడా తనకు తెల్సినంతవరకూ చెప్పడం ప్రారంభించింది —

(సశేషం)



# అంత్య సందేశం X

రచన:
శ్రీమతి పతానేని శ్రీశైల భ్రమరాంబ

(గత సంచిక తరువాయి)

మధ్యాహ్నం తీరిక సమయంలో మహేశ్వరి తమ ఎదురింటి పురోహితుడు శాస్త్రిలుగారింటి కెళ్ళి కూర్చునేది. శాస్త్రిలు గారి కొడుకు పట్నంలో యం. ఏ. చదువుకొంటున్నాడు. సెలవుల్లో వచ్చినప్పుడు ఆ అబ్బాయిని మహేశ్వరి కన్నబిడ్డలా చూచుకునేది. వాని చిన్నప్పుడు ఆ చనువే ఈ నాటికీ తగ్గకుండా మాతా పుత్ర ధర్మంగా మరింత ధృవపడింది. అతడు పట్నంనుంచి వచ్చింది మొదలు మళ్ళీ వెళ్లేవరకూ మహేశ్వరి దగ్గరే కూర్చుని ఎన్నో విషయాలు చెప్తూ వుండేవాడు. ఆ అబ్బాయి చెప్పిన ప్రతిసంగతీ తను మర్చిపోకుండా గుర్తుంచుకుని అవసరమైనంతవరకూ ఇరుగు పొరుగు వారికికూడా బోధిస్తోంది. ఎంతమందికైనా ధైర్యముగా చెప్పే మహేశ్వరి భర్తముందు మాత్రం నోరెత్త లేక పోయేది. ఈ నాడు కలిగినంత మహో ధైర్యం ఆమెలో ఈ నలభై అయిదు సంవత్సరాల జీవితంలోనూ ఎన్నడూ కల్గలేదు. అందుకే భర్తతో తెగించి మహా ధైర్యంగా పోరాడ్తూ పట్టుదలగా వాదించి మాట్లాడేసింది.

చివరకు గంగాధరం ఆమెతో వాదించి గెలువ లేక మెదలకుండా పడుకున్నాడు ఆ రాత్రి. మహేశ్వరి మాత్రం భర్తను ఎలాగైనా ఒప్పించాలని పట్టుదలగా ఆలోచిస్తూ ఎలాగో తెల్లవార్లూ గడిపింది.

మర్నాడు గంగాధరం పొలం వెళ్ళిపోగానే మహేశ్వరి తనదగ్గరున్న ముప్పాతిక రూపాయిలతోనూ కొన్ని బట్టలు తెప్పించి, బాగా నిరుపేదలైన గూడెంలోని వాళ్ళు అతి వృద్ధులకి గర్భిణీ స్త్రీలకి, పశిపిల్లలకి పంచిపెట్టింది. వాళ్ళు అవి తీసుకుంటూ పెట్టిన నమస్కారాలలో కోటి దీవనలున్నట్లు అయింది. మహేశ్వరికి.

సాయంత్రం గంగాధరం వీధిలో . అరుగుమీద కూర్చునేసరికి ఇద్దరు రైతులువచ్చి ఖామందుగారూ! ఇయ్యాల అమ్మగారిచ్చిన బట్టలు తీసుకుని మా యింట్లో వాళ్ళు మురిసిపోతున్నారండి బాబయ్యా! ఆ భగవంతులు మీ తంపతుల్ని చల్లగాచూసి మీ కడుపున పదిమంది సంతానంకల్గి యీ యిల్లు వెయ్యిళ్ళు వీరిధిల్లాలండి మా రాజు తల్లి, ఆధరమ తల్లి అంటూ ఆ వృద్ధుడు అనే సరికి ఆశ్చర్యపోయాడు గంగాధరం. అలాగే ఒక్కొక్కరేవచ్చి తమ ఆనందాన్ని తెలియచేస్తూంటే నిర్విణ్ణుడై కూర్చుండి పోయాడు గంగాధరం. ఈ సంగతి మహేశ్వరిని కనుక్కోవాలని లేవబోయాడు. ఆ సమయంలో రత్తాలు మామగారు ముసిలాడువచ్చి బాబయ్యా అమ్మగారు పంపించిన పాతిక రూపాయిలకి కాగితం రాయించుకుంటారాండి. ఆ మహాతల్లి కనికరించి ఆ డబ్బు పంపించినందుకు వాడుక్కురోగం తగ్గిందండి రాత్రి రద్తాలు నీళ్ళాడి మగపిల్లవాణ్ణి కన్నదండి. అందరం సుఖంగా నిన్న ఇయ్యాళ కడుపునిండా అన్నం తిన్నామండి. మీ కుటుంబాన్ని ఆ దేవుడు చల్లగా రక్షించాలి అంటూ వాని సంతోషాన్ని వెళ్ళబుచ్చి వెళ్ళిపోయాడు.

గబగబా గంగాధరం వచ్చి మహేశ్వరీ! నువ్వు వాళ్ళందరికీ బట్టలు పంచిపెట్టావా అన్నాడు ఆశ్చరంగా.

“అవును. కష్టాలతో కన్నీరు కారుస్తూ జీవయాత్ర చేసే ఈ పేదలకి ఇవ్వడంతో నాకు నిజమైన యాత్రా పుణ్యఫలం దక్కింది” అంది.

“అంతడబ్బు అలా పాడుచేశావా?”

“లేదు. సద్వినియోగంకు వినియోగపడ్డాయి మీరిచ్చిన వందరూపాయలు.”

విస్మయంగా ఆమె ముఖంలోకి చూస్తూ అలాగే నిలబడిపోయాడు గంగాధరం. ఆమె కళ్ళల్లో కాంతినీ, శాంతి, ఆనందంని వుదుకప్పిన నిప్పులాంటి ఆ ముఖంలో ......మైనంతో కప్పబడి చాలా మధువు ఆమె హృదయంలో వుందని గ్రహించుకున్నాడు. సుమేరు పర్వతంలా పట్టుదలగా మాట్లాడే ఆమెను తనేమీ దూషించలేకపోయాడు. తిన్నగా మళ్ళీ వీధిలోకి వచ్చి కూర్చున్నాడు...కాని భార్య వందరూపాయిలు నిమిషాల్లో వ్యయం చేసినందుకు మాత్రం అతని మనస్సు బరువెక్కిపోయి తను సంపాదించినప్పుడు పడిన శ్రమ తల్చుకుంటూంటే అతని మనస్సు చాలా బాధపడింది. సుఖంగాని, కష్టంగాని మితిమీరినప్పుడు మరొకరితో చెప్పుకుంటేనే కాని ఉపశాంతిలేదు కదా! అల్లాగే గంగాధరం తన మనస్సు తేలిక పర్చుకోవాలని ఎదురింటి శాస్త్రిలు గారింటికి వెళ్ళాడు.

ఎంతో అతి ముఖ్యమైన పని వుంటేనే కాని ఎనాడూ గుమ్మంలోకి రాని గంగాధరం వచ్చేసరికి శాస్త్రిగారు ఆహ్వానించి కూర్చోబెట్టాడు. కొంతసేపు ఏవో కబుర్లు చెప్పుకున్నాక "గంగాధరంగారూ: ఈ మహాశివరాత్రికి కాశీ రామేశ్వరం మొదలైనవన్నీ సంపూర్ణ యాత్రలు చేసుకువద్దామని నేనూ మా ఆవిడా ఎల్లుండి బయలుదేరి వెళ్తున్నామండీ!" అన్నాడు శాస్త్రిగారు.

'అయితే మీ యిద్దరికీ ఎంత సొమ్ము తీసుకువెడ్తున్నారు?'

"ఓ వెయ్యిరూపాయలు తీసుకు వెడ్తున్నాము. సరిపోతే సరిపోవచ్చు లేకపోతే కొంచెం తక్కువ అయినా మళ్ళీ యింటి దగ్గరనుంచి తెప్పించుకుంటామండి" అన్నాడు శాస్త్రి.

"వెయ్యి రూపాయిలే!" ఒక్కసారిగా నిశ్చేష్టుడైపోయాడు "అయితే మాత్రం పోయిందేమిటి గంగాధరంగారూ; వెధవ డబ్బు పుట్టుకతో సంపాదించారూః చచ్చేటప్పుడు కూడా పట్టుకపోతారూ చెప్పండి? ఏదో దైవం మనకి ఇచ్చినంతట్లోకి పుణ్యం పురుషార్ధం కాస్త చూసుకోవద్దా? ఇవ్వాళ ఛస్తే రేపటికి రెండు రోజులు అవుతుంది. మళ్ళీ అబ్బాయికి ఈఏటితో చదువు పూర్తయి ఇంటికివస్తే మమ్మల్ని వెళ్ళనిస్తాడో; లేదో; వాడురాకుండానే యాత్రలు కూడా పూర్తిచేసుకువస్తే ఇంకా కృష్ణారామా అంటూ ఇంట్లో కూర్చుంటాము. మీ బోటి ధనవంతులంటే ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్ళొచ్చు - మాలాంటి వాళ్ళకి ఎల్లా కుదురుతుంది. ఎల్లాగో నానా తంటాలూ పడి పదిహేను వందలు జాగ్రత్త చేసాననుకోండి. ఆదంతా యాత్రలకి, ఆ తర్వాత సంతర్పణ సమారాధనలకి సరిపెట్టుకుందామనుకొంటున్నాం" అన్నాడు వేదాంత ధోరణిలో -

"అంత సొమ్ము అల్లా రైలు ఖర్చులకి పోసి యాత్రలు చేసుకునేకంటే ఏదైనా భూమికొనుక్కోరాదండీ?" అన్నాడు తన సహజ ధోరణిలో గంగాధరం.

"ఆస్తికీ-అందానికీ, ఆదీ-అంతూ వుంటుందా గంగాధరంగారూ: దేవుడికి కొట్టే కొబ్బరికాయ పూజారి తింటాడని దుఃఖపడ్డట్టు, యాత్రకి వెడ్తూంటే రైలు ఖర్చులు కోసం మానుకుంటామా?" అన్నాడు నవ్వుతూ.

ఏమిటోనండీ; ఎవరిధోరణి వాళ్ళకి నచ్చుతుంది అసలు యాత్రలు గుళ్ళు గోపురాలు, నోములు వ్రతాలు అంటే ఆడవాళ్ళకి మాత్రం మాచెడ్డ భక్తి. వాళ్ళకి ఉన్నది చాలక కట్టుకున్నవాళ్ళని కూడా వేధించుకు చంపుతా రెందుకో...." అన్నాడు తన మనో వేదనను వెళ్ళగక్కుతూ.

"గంగాధరంగారూ; మీరు చాలా అదృష్టవంతులు కాబట్టి ఆ మహేశ్వరిగారు కూడా మీతో ఏకీభవిస్తున్నారు. మా ఆవిడవుంది మాకారూ! దానికి తగని పిసినిగొట్టు తనమండీ, పదేళ్ళనుంచి యాత్రకి వెడ్దామని దానిని ప్రయాణం చేస్తోంటే ఇప్పటి వరకూ దాని అంగీకారమే పొందలేక పోయానంటే ఆమె ఎంతటి ధనకాంక్ష పరురాలో అర్ధం చేసుకోండి! అది చూస్తూండగా ఒక్క కానీ కూడా ఖర్చు పెట్టడానికి ఒప్పుకోదు. ఆఖరికి డబ్బు కడిగి గొంతుకలో పోస్తేనే కాని దాని ప్రాణం కూడా పోదు చివరి క్షణాల్లో - ఏమిటో దైవ చిద్విలాసః? అతకని బ్రతుకులతోనే ఈ అరవై ఏళ్ళ జీవితం గడిచిపోయిందనుకోండి. ఎల్లాగైనా ఈ శివరాత్రికి తప్పకుండా యాత్రలకి వెళ్ళాలనే వుందండీ - మా ఆవిడవచ్చినా రాకపోయినా నేను వెళ్ళడం మాత్రం ఖాయం. నేనొక్కడినే వెళ్ళేటట్లయితే దక్షిణాది యాత్రలు రామేశ్వరం వరకూ, ఇటు కాశీ వగైరాలు ఉత్తరాది యాత్రలు, అసలు ప్రపంచ యాత్ర అన్నీ చేసుకురావాలని వుంది నాకు. ఏది ఏమైనా సరే గంగాధరం గారూ! మా ఆవిడ నాతో రాకపోతే పదిహేను వందల రూపాయిలు పట్టుకు వెళ్ళి హాయిగా ఆర్నెల్లపాటు యాత్రలన్నీ చేసుకు వస్తా" అంటూ ఎంతో ఉత్సాహంతో చెప్పుకొచ్చాడు శాస్త్రుల్లు.

"మీకైతే వున్నదంతా ఇప్పుడు ఖర్చు పెట్టుకున్నా తర్వాత మీ కొడుకు ఉద్యోగం చేసి పోషిస్తాడు. మరి నాబోటి వాడికి అదేమీ లేదుకదా! ముసలితనం వచ్చాక విశ్రాంతిగా కాలం గడపడానికేమీ "పెన్షన్" లాంటి దేమీ వుండదుకదా! ఇప్పుడు కష్టించి కూడబెట్టుకుంటేనే వృద్దాప్యం వచ్చాక సుఖంగా రోజులు గడుపుకోవచ్చు, ముందాలోచన లేకుండా ఉన్న సొమ్ము వృధాగా యాత్రల కోసం ఖర్చు చెయ్యడం మాత్రం నాకిష్టముండదండీ!" అంటూ అనేసి అక్కడనుంచి లేచి ఇంట్లోకి వచ్చేశాడు గంగాధరం.

గదిలో మంచంమీద పడుకుని కిటికీలో దీపం పెట్టుకు మహేశ్వరి చదువుకొంటోంది. పుస్తకంలో లీనమై పోయిన మహేశ్వరి భర్తరాక కూడా గమనించ లేదు.

"రాత్రిళ్ళు అస్తమానూ చదువుతూంటే కళ్ళు పాడై పోతాయి మహేశ్వరీ! ఎందుకు అనవసరంగా కిరసనాయిలు దండగ చేస్తావ్?" అన్నాడు ఆమె ప్రక్కనే కూర్చుంటూ గంగాధరం.

"ఏమండీ? మీలోభిత్వానికి కూడా ఒక హద్దూ పద్దూ అనేది ఇంక మన జీవితంలో ఎప్పుడండీ?...పోనీ చదువుకోడం మానేసి దీపం ఖర్చు మీరు చెప్పినట్లే తగ్గించేస్తా - కాని నేనొక్కటి మాత్రం కోరుకుంటూ అది కాదనకుండా వుంటే చాలు"

"ఇదుగో ఒక్క షరతుమీద నైతే నువ్వేన్ని చెప్పినా వినడానికి నా అభ్యంతరం లేదు - డబ్బు ఖర్చుపెట్టి ఏపనీ చెయ్యమని మాత్రం నాదగ్గర చెప్పకు"

"ఏమండీ మనకింత వయస్సు వచ్చినా ఇంకా అజ్ఞానమనే రొండిలో కూరుకుపోతూ పుణ్యం పురుషార్థం తెల్సుకోకపోతే ఇంకెప్పుడండీ? మనకన్ను మూస్తే లోకమంతా చీకటై పోతుందేకాని...ఇప్పటికైనా శిధిల గృహాలవంటి మనస్సులో జ్ఞానదీపాన్ని వెలిగించుకుని గడవబోయే జీవితాన్నైనా భగవత్సేవలో వినియోగిద్దాం - ఎన్నాళ్ళింకా ఈ మమకారం, ధన కాంక్ష అనే పిశాచాన్ని హృదయంలో తిష్టవేయించుకు కూర్చోబెట్టుకుంటారు? ఇంతకాలం వరకూ ధనం, మోహం, సంసారం అంటూ అజ్ఞానంలో గడిచిందా మన బతుకు - ఈపాటి ఓపికా, దారుఢ్యం కూడా మనలోంచి పోయాక దివ్యక్షేత్రాలని దర్శించాలన్నా అప్పుడు మనకు అసాధ్యమైపోతుంది...."

సగంలోనే అందుకుని "అందుకనే ఆడవాళ్ళకి అతి తెలివి తేటలు వుండకూడదంటారు. అదీకాక ఎక్కువ సేపూ మగాళ్ళని వేధించుకు తింటారు. భక్తికీ తీర్థయాత్రలకీ మగవాడే అన్నింటికీ అర్హుడు..."

"అహా! ఎంతటి గొప్ప ఆలోచనండీ? మీవంటి వాళ్ళకి అన్ని విషయాలూ బోధపర్చి చెప్పాలంటే నా ఆయువు కూడా సరిపోదు. కాని ఒక్క విషయాన్ని తెల్సుకోండి. మహారాణి అయివుండీ సర్వసంగ పరిత్యాగ మొనరించి మీరాబాయి కృష్ణుని సేవించింది. భగవద్భక్తి విషయంలో ఆడమగ అనే తారతమ్యం అక్కర్లేదు. హరినామ సంకీర్తనానికి అడ్డువచ్చిన తండ్రినికూడా తృణీకరించాడు వాని సోదరుడైన విభీషణుడు. భగవంతుని కోసం తన భార్యని కూడా త్యజించాడు భర్తృహరి మహాశయుడు - కృష్ణ పరమాత్మ కోసం భర్తను కూడా వదిలివేసింది మీరాబాయి మహాసాధ్వి...భక్తికోసం, భగవత్సేవ కోసం మాత్రం మీతో నేను పోరాడి అయినా జయించడమో! మరణించడమో; ఏదో ఒకటి తప్పకుండా జరిగిపోతుందని మాత్రం గుర్తుంచుకోండి" అంటూ ఆవేశంగా చెప్పింది మహేశ్వరి.

"మహేశ్వరీ! నీలో ఏదో పిశాచి ప్రవేశించి యిల్లా పేలిస్తోంది కాని...ఎన్నడయినా యింత కఠినంగా మాట్లాడేవా?" అన్నాడు నెమ్మదిగా గంగాధరం.

"ఊరు పొమ్మంటోంది, కాడి రమ్మటోంది; అనే కాలం వస్తోంది మనకి. ఇప్పటికైనా మీలో మార్పురాకపోతే అది నా ప్రారబ్ధమనుకోవాలో; పాపిష్టి బ్రతుకులు అనాలో కూడా అర్థమవడంలేదు నాకు" అంది తీవ్రంగా ఆమె.

"ఇంక నీతో వాదించేకంటే...ఛీ! ఉత్తరోత్తరా డబ్బు ఉండాలి లేకపోతే మన తనువులు గడవడం కష్టం అనే ఆలోచనలేని మనిషితో మాట్లాడ్డం కూడా నాదే బుద్ధి పొరపాటు" అంటూ కస్సుమంటూ అక్కడనుంచి లేచి వెళ్లిపోయాడు గంగాధరం.

ఆ మర్నాడు మధ్యాహ్నం ఇంట్లో ఏమీ తోచక ఆ ప్రక్క వీధినే వున్న తన మిత్రురాలు ఇంటికి వెళ్ళింది మహేశ్వరి. ఏదో కొంతసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాక "మహేశ్వరీ! మీ ఆయన గంగాధరం మా భూమి మీద ఏమైనా నాల్గువేలు అప్పు యిస్తారేమో అడుగుతావా? మొత్తం ఆస్థి అంతా తనఖా పెడ్తాము - ఒక వేళ అల్లా యివ్వడానికి ఒప్పుకోకపోతే కొంచెం పొలం అమ్ముకొంటాం. అదీ మీ పొలం సరిహద్దులోనే వుంది లే" అంది వేడికోలుగా.

"అల్లాగే నా కాయశక్తులా ప్రయత్నించి చెప్తా" అంది మహేశ్వరి ...

చెప్పింది. తన దగ్గర పదివేలు వున్నాయని, దానితో భూమికొనే ప్రయత్నంలో వున్నానని నిష్కల్మష హృదయంతో నిజంచెప్పాడు గంగాధరం.

భక్తిగానూ, ప్రేమగానూ ఎంత చెప్పినా గంగాధరం తన మాట కలలో కూడా వినడని, పుర్రెతో పుట్టిన బుద్ధి...పోదని మనస్సులో నిశ్చయించుకుని ఎత్తుకు పై ఎత్తు వేసి భర్తను మంచి మార్గంలో పెట్టాలని బాగా తీవ్రంగా ఆలోచించింది మహేశ్వరి.

దైవ భక్తి గలవాడు, లోకానుభవం గలవాడు, వృద్ధుడు, తీర్థయాత్రల్లో వుండే కష్టసుఖాలు బాగా తెల్సిన అనుభవశాలి అయిన శాస్త్రిల్లుగారి యింటికి వెళ్ళి ఆయనతో అన్ని విషయాలూ సంప్రదించింది మహేశ్వరి.

శాస్త్రి, మహేశ్వరి తండ్రి కూతుళ్ళవలె భేదాభిప్రాయాలు లేకుండా జరగవలసిన కార్యక్రమాన్ని గురించి ప్లాను వేసుకుని ఇంటికొచ్చింది మహేశ్వరి.

రాత్రంతా శాస్త్రిగారు, మహేశ్వరి కల్సి గంగాధరం మనస్సుకి నచ్చేలాగ బోధించడం ప్రారంభించారు. కాశీ రామేశ్వరం అనుకుంటేనే పుణ్యం.

× × ×

అనుకున్న శుభ ముహూర్తం నాడు మహేశ్వరి గంగాధరం, శాస్త్రి ముగ్గురూ కాశీరామేశ్వర యాత్రలకి బయల్దేరారు. ఒక వైపు మహేశ్వరి, మరో వైపు శాస్త్రిగారు క్షణక్షణానికి గంగాధరానికి నచ్చచెప్తూ, మనస్సుకి జ్ఞానోదయం కల్గజేస్తుంటే...ఎల్లాగో అస్వతంత్రుడై వారిష్ట ప్రకారం చేస్తున్నాడు గంగాధరం. దేశంలో వుండే సమస్త తీర్థ యాత్రలు చేసుకు, పుణ్యప్రదేశాలన్నీ దర్శించుకు తృప్తిగా అన్ని చోట్లా దానధర్మాలు యధావిధిగా తమ శక్త్యానుసారం చేస్తూ అభిషేకాలు, కుంకుమ పూజలు, తమ మనస్సు సంకల్పించుకున్న ప్రకారం అన్నీ చేశారు. మహేశ్వరి శాస్త్రిగారు మనస్సులో కొంచెం బాధపడ్తూన్నా గంగాధరం కూడా వారితో సమానంగానే అన్నీ చేశాడు. తిన్నచోట నిద్రించక, నిద్రించినచోట మళ్లీ నివశించక ప్రతీ పుణ్యస్థలాల్నీ దర్శించుకు వచ్చేసరికి ఆరు మాసాల్లూ పూర్తయింది. ముగ్గురికి యింటికి వచ్చాక [illegible] సమారాధనలు అన్నీ పూర్తి చేసుకున్నారు. మహేశ్వరికి మనస్సులో ఎంతో తృప్తిగా ఆనందంగానూ వుంది.

ఓరోజున సాయంకాలంగా కూర్చుని మహేశ్వరితో మెల్లిగా యాత్రా ఖర్చుల విషయమై అడిగాడు. అందుకు ఆమె సరియైన జవాబు యివ్వకపోవడంతో మళ్ళీ "మహేశ్వరీ! ఆనాడు నీ స్నేహితురాలి భర్త సీతారామయ్యగారి భూమి విషయమై మాట్లాడి శాస్త్రిగారు పదివేల రూపాయిలు తీసుకు వెళ్ళి వాళ్ళకిచ్చానన్నాడు. ఆదేదో వ్రాయించకుండా తనఖా దస్తావేజు రిజిస్టరీ చేయించకుండా అంత సొమ్ము వాళ్ళకెందుకిచ్చావని నేను దండించి అడిగితే, తన పొరపాటుకి ఫలితంగా ఆ సొమ్ముకు ప్రామిశరీనోటు తనే వ్రాసి యిచ్చాడు. ఇంక రేపు ఆవిషయమై శాస్త్రిగారిని కనుక్కొని అడగాలను కొంటున్నా" అన్నాడు నెమ్మదిగా.

(సశేషం)

## సూచనలు

ఉప్పును పొడిగా వుంచడానికి, ఉప్పు డబ్బాలో రెండు మూడు బియ్యపు గింజలు వెయ్యండి. అవి చెమ్మను పీల్చుతాయి.

* * *

కార్కు సీసాకు పట్టకుండా వున్నట్టయితే, దానిని కొన్ని నిమిషాలు కాగుతోన్న నీళ్లలో వెయ్యండి.

* * *

పొడిగా వున్నచోట పెట్టిన సబ్బు, తడిగా వున్నచోట పెట్టిన దానికంటె మూడు రెట్లు ఎక్కువగా మన్నుతుంది.

---

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ బాధ్యులుకాదు. ——సంపాదకుడు.

# అంత్య సందేశం X

రచన:
శ్రీమతి పతానేని శ్రీశైలభ్రమరాంబ

(గత సంచిక తరువాయి)

'ఆ సొమ్ము విషయమై శాస్త్రుల్లుగారిని అడగాల్సిన అవసరంలేదు. ఆ సొమ్ము అంతాకూడా ఆయన నాచేతికే ఇచ్చారు. అందులోది ఆయనకోసం ఖర్చు పెట్టింది ఒక వెయ్యి రూపాయిలు మాత్రమే. ఆ పదివేల రూపాయిల్లోనూ ఇంక మూడు వందలుమాత్రం నాదగ్గర వున్నాయి.' అంది భయపడ్తూ మహేశ్వరి.

'మరి మొత్తం యాత్రల ఖర్చు అంతాకల్సి అయిదారు వందలకి లోపునే అయిందని ఎందుకు చెప్పారు?' తీవ్రంగా అడిగాడు గంగాధరం.

'మీకెన్నివిధాల నచ్చచెప్పినా వినకపోవడంచేత ఈవిధంగా అసత్యం చెప్పి ఆ సొమ్ముతో ఈ......'

'ఇంతకీ నీకీ విషబోధ చేసింది ఆ శాస్త్రిగాదేనా?, అని గర్జించి అడిగాడు గంగాధరం.

'కాదు, ఇల్లా చెయ్యమని, చెప్పమని నేనే ఆయన్ని కోరుకున్నా.'

'కట్టుకున్న మొగుణ్ణి మోసంచేసి, మభ్యపెట్టి నువ్వు యిల్లా చెయ్యడంకంటె మరోపాపం ఇంకోటి వుందా?,

'ఇందులో నా దృష్టికి ఈపని తప్పుగా మాత్రం కన్పించడంలేదు. నేనింతవరకూ కాపురానికి వచ్చాక ముప్పైఏళ్ళనుంచీ కనీసం ఏ చిన్న కోరికా మీకు నెరవేర్చలేదు. అందుకు ప్రతీకారం చెయ్యాలనికూడా మనస్సులో ఎన్నడూ అనుకోకుండా మీయందు గౌరవాభిమానములచేత నేనేమీ నోరెత్తి జవాబివ్వకుండవున్నా ...మీధనంలో నాకూ హక్కు వుంది. అందుకే స్వతంత్రించి పరమార్థ చింతతో ఖర్చుపెట్టా నీ ధనం. ఇంత మాత్రంలో మనకి ఏమీ తరిగిపోలేదు. లెండి' అనేసింది.

ఆమాటతో ఆమె ముఖంలోకి చురచురా చూస్తూ 'ఆ ఖర్చుకి ఓలెఖ్ఖా పత్రమూకూడా లేదన్నమాట' అని అరిచాడు.

పెట్టెలోనుంచి ఓ చిన్న పుస్తకం తెచ్చి అతని ముందుంచి 'ఇదిగో మీరిచ్చిన సొమ్ముయొక్క జమా ఖర్చు వివరాలు యిందులో వున్నాయి. మనకోసం నానాకష్టాలుపడి, అన్ని యాత్రలూ దగ్గరుండి చేయించినందుకు ఆ వెయ్యి రూపాయిలూ తిరిగి ఇవ్వక్కర్లేదని కూడా శాస్తుల్లుగారికి చెప్పాను' అంటూ చల్లగా చెప్పింది మహేశ్వరి.

'ఆ ఉన్నడబ్బుకూడా నీయిష్టమొచ్చినట్టు తగలేసుకో.. అసలు చేతిలో సొమ్ము ముందుగా యిచ్చినందుకు తగిన బుద్ధి చెప్పావు సన్యాసిపీనుగా' అంటూ కోపంగా పళ్లు పటపటలాడిస్తూ అక్కడినుంచి తిన్నగా వీధిలోకి వెళ్ళిపోయాడు. ఆ మర్నాడు ప్రొద్దున్నే గంగాధరం పొలం వెళ్ళి చూచుకున్నాడు. రత్తాలు, ఆమె భర్త, ముసిలాడుకూడా పొలంలోకి వచ్చిన గంగాధరానికి తాము చేసిన పన్లు చూపిస్తూ' బాబయ్యా! కూలీలకి మీరిచ్చిన ధాన్యం సరిపోకపోతే ఇంకో బస్తా గింజలు డాట్టరుబాబూగారి దగ్గర అప్పుపుచ్చుకు కూలీలకు కొలిచామండి. మీపొలం మీరింక చూసుకున్నా మేమేం అడ్డం రామండి. డాట్టరుబాబుగారిక్కిమాత్రం ధాన్యం మీరిచ్చెయ్యండి' అంటూ చెప్పి పొలం అప్పగించారు తనకి.

ఆమాటతో గంగాధరానికి కోపం చిర్రెత్తుకొచ్చి వాళ్ళందర్నీ అడ్డమైన దుర్భాషలాడి ధుమధుమలాడ్తూ ఇంటికొచ్చాడు.

'నీకోసం, నీమూలాన్ని అన్నివిధాలా నేను సర్వనాశనమయ్యాను. ఇప్పుడు నీకళ్ళు చల్లగా వున్నాయా?' అంటూ ఉరిమాడు మహేశ్వరి ముందుకు వచ్చి.

''మరేం ఫరవాలేదు-ఇంతవరకూ ప్రతీ ఏటా నా అదృష్టం వల్లనే బాగుపడ్డానని ఎన్నోసార్లు అన్నారు. ఈనాడు ఈ ఒక్కసారి నా మూలాన్ని నష్టపోయినా మీ భూమికేం నష్టం రాదు లెండి'' అంది నిర్లక్ష్యంగా.

''కొనుక్కోవల్సిన భూమి చెడిపోయి, పండవల్సిన భూమి సరిగా రాకపోతే ఇదంతా...''

''ఇక ముందునుంచీ మీకు వందలకొద్దీ ఎకరాలు వుండనివ్వరు. ప్రభుత్వం మనిషికి ముప్పై యకరాలు మించి వుండకూడదని ఓ చట్టం ఏర్పాటు చేస్తున్నారు,

అప్పుడైనా మీరిక ప్రయత్నించడం మీద శుద్ధ తెలివి తక్కువ...'' అంటూ తీర్పిచ్చిన జడ్జిలా చెప్పింది మహేశ్వరి.

తనని ఎదిరించి జవాబిచ్చిందనే కోపంతో భోజనం చెయ్యకుండా పొలం వెళ్ళి కూర్చున్నాడు గంగాధరం. శాస్త్రిల్లు గారి చేత తన దగ్గరున్న మూడు వందల రూపాయిలకు బట్టలు తెప్పించింది. గూడెంలోని వాళ్ళకి తన యింట్లో దాసీ మనిషి చేత కబురు చేయించి ఆ బీద వాళ్ళందరికీ పంచిపెట్టిచ్చింది మహేశ్వరి. ఓ బస్తా బియ్యం కూడా ఆ బీదలకందరికీ యిచ్చింది. వాళ్ళు ఎంతో సంతోషంతో వెళ్ళి పోయారు. ఆ నిరుపేదలు పొందిన ఆనందాన్ని చూచేసరికి మహేశ్వరి మనస్సు ఉప్పొంగిపోయి తన జన్మ సార్థకమైనట్లుగా భావించుకుంది.

ఖర్చు అయిపోయిన డబ్బు విషయంలో కీచులాటలతో ఎల్లాగో ఓ వారం రోజులు గడిపాడు గంగాధరం—

అంతలో మహేశ్వరికి జ్వరం పట్టుకుంది. ఆరు మాసాలు ఏకాగ్రంగా నిత్యస్నానాలు వేళకు సరిగా నిద్రాహారములు లేకపోవడం చేత చాలా బలహీనురాలయి పోయింది జ్వరం వచ్చిన పదిరోజులకే మంచం మీద నుంచి లేవలేని స్థితికి వచ్చేసింది మహేశ్వరి.

గంగాధరానికి ఈసారి మాత్రం ధనం మీది కాంక్షతో.. డబ్బు అంతా వృధావ్యయమై పోయిందన్న ఆవేదనతో భార్యయొక్క రోగాన్ని కూడా సరిగా గమనించే స్థితిలో లేడు. భార్య మంచంలో పడి మూలుగుతున్నా కాని అతని ధోరణి మారలేదు. అతని కెప్పుడూ ఒకటే ఆలోచన; మళ్ళీ ఈ పదివేల రూపాయిలు ఎలా కూడబెట్టడం? తనమీద ఊళ్లో ఎవ్వరికీ ఆవగింజంత కూడా అభిమానం లేదు. తనకి గౌరవం లేకపోయినా ఈ మహేశ్వరిమీద ఎందుకింత గౌరవాభిమానాలు చూపిస్తున్నారు? సొమ్ము తనదే అయినా ఈమెకింత పేరెందుకు రావాలి? ఈ ప్రపంచంలో తన నెవరైనా నిజంగా ప్రేమిస్తున్నారా? ఒక వేళ మహేశ్వరికి కూడా తనని హృదయ పూర్వకంగా ప్రేమించడం లేదేమో! తనకున్న ధనాన్ని చూచే ఆమె తనయందింత గౌరవం చూపిస్తోందేమో! అని తనలో తను ఆలోచించుకుంటూ కూర్చున్న గంగాధరం దగ్గరికి ఊళ్లో ఆడవాళ్ళు ఓ పాతిక మందివచ్చి, గంగాధరం గారూ! మహేశ్వరిగార్కి జ్వరం నానాటికీ పెరిగి పోతోంది. ఇది శృతిమించుకొచ్చాక మనం చేసేదేమీ వుండదు. ఎవర్ని అయినా పెద్ద డాక్టరును తీసుకొచ్చి చూపించి తగినమందిప్పించండి.'' అంటూ అక్కడికివచ్చి మహేశ్వరిని చూచిన వాళ్లంతా ఎవరికి తోచినట్లుగా వాళ్ళు భార్యకి మందిప్పించడం లేదని గంగాధరాన్ని ఎన్నో మాటలని వెళ్ళి పోయారు.

మళ్ళీ మనస్సులో ఆలోచన ''ఛీ! అందరూ భట్రాజుల్లా మహేశ్వరిని పొగిడే వాళ్ళే కాని తనని గురించి పల్లెత్తు మంచి మాట కూడా అనని వాళ్ళమాటని లెక్కచేసి తనెందుకు మందు యిప్పించాలి? వీళ్లందరి దృష్టిలో నూతనోచనిట దద్దమ్మలా, నోరులేని వాజమ్మలా, వీధిలో తిరిగే ఊరకుక్కలా హీనంగా కన్పిస్తున్నాడా వాళ్ళ దృష్టిలో తను అనుకొంటూ పళ్లు పటకొరుక్కున్నాడు గంగాధరం.

నెలరోజులయ్యేసరికి మహేశ్వరి స్థితి పూర్తిగా మారిపోయింది. పుష్టిగా బలంగా వుండే ఆమె అస్థిపంజరం బొమ్మలా తయారైంది.

ఆయాసం కూడా ఎక్కువై పోయింది. ఇంత స్థితికి వచ్చాక కూడా గంగాధరానికి ఆమెమీద శ్రద్ధ లేక పోయింది.

కోతలు కూడా కోస్తున్నారు. కుప్ప నూర్పుళ్లలో కళ్ళం ఇంక ఎవరు కాపలా కాస్తున్నా నమ్మే స్వభావం కాదు అతనిది ఆరోజు సాయంత్రం మహేశ్వరి దగ్గర కూర్చుని తను ఈ రాత్రి పొలంలో కాపలాకి వెడుతున్నానని చెప్పాడు.

''నన్నీ స్థితిలో వదలి మీరు పొలం వెళ్ళిపోతానంటే ఏమనాలో నాకే తెలీడం లేదు. కాని నా చివరి మాట ఒకటిమాత్రం విని మరీ వెళ్ళిపొండి. మీరు వచ్చేసరికి నేను బ్రతికి వుంటానో, లేదో అనుమానంగా వుంది. మీరు యిప్పుడు నా గురించి పట్టించుకోపోయినా, నే వెళ్ళి పోయాక మాత్రం తెల్సుకోగల్గుతారు. ఆ నాడు మీకు సుఖశాంతులు దూరమై విలసించినా నేను కన్పించను.'' అంటూండగానే ఆయాసం వచ్చి మాట్లాడలేక పోయింది.

''మరి నేను కళ్ళం దగ్గరలేకపోతే ఎవరయినా గింజలు కాజేస్తే ఇంక గత్యంతరం ఏమిటి?'' అన్నాడు కొంచెం బాధగానే.

"పోన్లెండి-మీ యిష్టం. నా చివర సమయంలో దగరుంటారనుకున్నా-ఇదుగో మీకు నా తుది వందనం-అంటూ లేవబోయింది మహేశ్వరి.

ఆతని మనస్సు విలవిల్లాడి పోయింది-వుండి పోడానికి మనస్కరించడం లేదు. వెళ్లడానికి కాళ్లు రావడం లేదు. ముప్పయి సంవత్సరాలు తనని కదలకుండా, తననే దైవంగా భావించి పూజించిన తన అర్ధాంగి మహేశ్వరి కడసారి...అనేసరికి ఆతని ఒళ్ళు ఝుల్లుమంది. అల్లాగే కూర్చుండి పోయాడు గంగాధరం-

"నా రోగంతో మీకు సరిగా భోజనమైనా పదరకమనిషి సగమై పోయారు. నా చేత్తో మీకు అన్నం పెట్టే అదృష్టం—ఈ జన్మలో ఇంక లేదు..." అంటూ కంట తడిపెట్టింది.

ఆ మాటతో ఆతని కడుపులో చెయ్యి పెట్టి కలికినట్లయింది. "ఇంక మీ సుఖం కోసం ఎవ్వరూ దేవులాడక పోయినా...మీ డబ్బుకోసం ఆశించి మమ్మల్ని పొగడి ఉబ్బేస్తారు...ఇంక మీ ..."

ఇంక ఆయాసముతో చెప్పలేక పోయింది మహేశ్వరి. "అంత బాధపడ్తూ మాట్లాడకు. పోని పొలం వెళ్ళడం మానివేస్తానులే .." అని అంటూండగానే శాస్త్రిగారి అబ్బాయి రాజా వచ్చాడు. వచ్చీ రాగానే పిన్నీ! పిన్నీ!! అయ్యో!!! అదేమిటమ్మా! అలా అయి పోయావ్? ఏమండీ గంగాధరం బాబయ్యగారూ! మా పిన్నికి మందు ఎక్కడ యిప్పిస్తున్నారు?" అంటూ ఎంతో ఆదుర్దాగా అడుగుతూ మహేశ్వరి మంచం మీద కూర్చున్నాడు రాజా.

"ఎప్పుడొచ్చావు రాజా? ఖులాసాగా వున్నావా నాయనా! అంది పుత్ర వాత్సల్యంతో మహేశ్వరి.

"ఇప్పుడేనమ్మా! ఇంట్లోకి వెళ్ళగానే మా నాన్నగారు చెప్పారనీ ఆరోగ్యము బాగులేదని లోపలికి వెళ్ళి ఇంకా అమ్మకైనా కన్పించలేదు. ఇల్లాగే వచ్చేశా" అంటూ రాజుకు మహేశ్వరిని చూస్తూ కళ్ళంట నీళ్ళు కార్చేశాడు.-

అంతలో శాస్త్రుల్లు అక్కడి కొచ్చి జరిగిన సంగతంతా కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పాడు కొడుక్కి. అంతా విన్నాక రాజు భోరున ఏడ్చాడు. వెంటనే వెళ్ళి ఊళ్లో ఉన్న డాక్టరును తీసుకు రావడానికి వెళ్ళి పోయాడు.

ఎటూ తోచక ఆదుర్దాగా కూలబడ్డాడు గంగాధరం. అరగంటలో డాక్టరును వెంటబెట్టుకుని వచ్చాడు రాజు. మహేశ్వరిని పరీక్షించి పెదవి విరిచాడు డాక్టరు.

"ఈవిడ నా తల్లిలాంటిది డాక్టరుగారూ! మా అమ్మను కాపాడే భారం మీమీదే వుందండీ?" అని దీనాతిదీనంగా వేడుకున్నాడు రాజు.

"అంతా శ్రుతిమించి పోయింది రాజేశ్వ;రావు గారూ పెద్ద సర్జన్ను తీసుకొస్తే ఏమైనా..."

"అంతవరకూ మీరిక్కడే వుండండి నేను వెళ్ళి సర్జన్ను తీసుకువస్తా" "నేను కూడా ఓ ఉత్తరం వ్రాసి యిస్తా. మీ మాటకి కొంచెం బలంగా వుంటుంది అని వ్రాసి యిచ్చాక వెళ్ళిపోయాడు రాజు.

సర్జన్ని తీసుకువచ్చి చూపించాడు. "నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఆపైన దైవానిదే..." అంటూ ఓదార్చే స్వరంతో చెప్పి ఇంజక్షన్ చేశాడు. ఆ రాత్రంతా సజ్జను డాక్టరు కల్సి మహేశ్వరి ఒళ్లంతా చిల్లులు పడేలా ఇంజక్షన్లు చేశారు. తెల్లవారింది కాని మహేశ్వరిలో మార్పు ఏమీ లేదు. మాట అతినీర్సంగా అస్పష్టంగా వస్తోంది.

"రాజూ!" అంది మెల్లిగా.

"అమ్మా!" అంటూ దగ్గరగా కూర్చున్నాడు.

"ఆయన" అంది ప్రక్కకి చూస్తూ. "బాబయ్య గారూ! ఇల్లారండి" అని పిల్చాడు రాజు.

గంగాధరం వచ్చి ఎదురుగా నిల్చున్నాడు.

"మీరు..." ఏదో అనబోయింది.

డాక్టరు వచ్చి "ఇప్పుడు మాట్లాడకండి. ఆయాసం వస్తుంది." అన్నాడు.

"మహేశ్వరి భర్తను దగ్గరగా రమ్మని చేతితో సంజ్ఞ చేసింది. సర్జను గంగాధరాన్ని చెయ్యి పట్టుకు తీసుకెళ్ళి ఆమె దగ్గరగా కూర్చోబెట్టాడు.

"మీ ధనంతో దేశానికి ఉపకారం చెయ్యండి. మన ఆస్తి అంతా పెట్టి పేదలకోసం...ఆసుపత్రి స్కూలు స...దు...సా...యం...చెయ్యండి ..మన... అ...బ్బా...యి...గా...ఈ. .రా...జు...ను..." ఇంక చెప్పలేక పోయింది మహేశ్వరి. "చేస్తాను. మహేశ్వరీ! నువ్వు చెప్పినట్లు తప్పకుండా చేస్తాను. అన్నాడు గంగాధరం.

ఆ మాట చెవులకి వినిపించింది. ఎండి పోయిన ముఖంలో చిరునవ్వు తాండవించింది. ఆ నవ్వు శాశ్వతంగా నిల్చిపోయింది. ఆ ముఖంలో-సాయంత్రం అందరి యింట్లోనూ దీపం వెలిగింది. గంగాధరం గర్వంలో జ్యోతి ఆరిపోయింది.

గంగాధరం కూడా గుండెలు బ్రద్దలయ్యే

(తరువాయి 18వ పేజీలో)

# ఊటసుద్దులు X

రచన:
శ్రీ. ఎన్. లక్ష్మీనారాయణ.

"ఇద్దరు అనుకొంటేనే కదవే ఈ ఆటోమేటిక్ పెళ్ళి' అనే యుగళ గీతికొక దానిని నిర్మాతలు ఆ మధ్య వినిపించారో చిత్రంలో: రెండు చేతులు కలిస్తేనే శబ్దం వస్తుంది. అల్లాగే రెండు హృదయాలు ఏకమైతేనే అనురాగం ఆవిర్భవించి అది కాస్త పెళ్ళికి మేళం పడుతుంది; ఒక్కరు అనుకొంటే పెళ్ళికాదు: అందులోనూ ఆటోమేటిగ్గా అవటం మరీకష్టం: రెండు చక్రాలుంటేనే రథం ముందుకు సాగేట్టు, ఇద్దరి ప్రేమలోని పొరపొచ్చాలు గతికి అపోహాలు చితికి, హృదయాలు అతికితే ఆ ఇద్దరూ ఆటోమేటిగ్గా ఓ ఇంటి వారవటానికి అవకాశముంటుంది, లోకం చాల విచిత్రమైంది, రోజూ అల్లాంటి ఆటోమేటి పెళ్ళిళ్ళు ఎన్నెన్ని జరుగుతుంటవో యేమో కానీ అల్లా జరిగేవన్నీ తీరాజరిగాక ఎంతవరకు జయప్రదంగా, సుఖవంతంగా సాగి పోతున్నాయనేదో పెద్ద సమస్య.

'ప్రేమ గుడ్డిదని' ఎవరో అన్నమాటకేం కానీ, దానికీ టెంపరేచర్ ఉన్నదనీ, జవ జీవాలున్నవనే అంశాలు ప్రేమ వివాహాలు జయ ప్రదంగా సాగిపోయే వారి ప్రేమల విషయంలో చక్కగా బుజువవుతున్నాయి. ప్రేమికులకు కళ్ళుంటాయి. కళ్ళు లేక పోయినా హృదయాలుంటాయి. ఈ పుడమిలో ప్రేమించుకొనేవారు సామాన్యంగా మొదట కళ్ళతో మాటాడుకొని తరువాత సాయంత్రపు మసక చీకట్లలోనో, పున్నమి వెన్నెలలోనో, హృదయాలను విప్పి వాటితో మాటాడుకొంటారు. అనంతరం ఆవులించేంతటి వ్యవధిలోనే ఆ రెండు హృదయాలూ ఒకదానినొకటి గాఢంగా పెన వేసుకొంటాయి. పేకలు మేకులయ్యేట్టు. తొలుదొల్త గిగేల్లాటి వారి అనురాగలతలు అభివృద్ధిచెంది, అందరూ అచ్చెరువొందేట్టు అనతికాలంలోనే అవిబలిష్ఠమై, అపురూపంగా అగుపిస్తాయి. అల్లా అది ఎంతవరకు వస్తుందంటే ఏదో ఒక మారుమూలలో ఓ నిర్మానుష్య ప్రదేశంలో నిశ్శబ్దంగా ఏకమైన వారి నిశ్చల హృదయాలు చెట్టాపట్టాలేసుకొని పదిమంది మధ్య యుగళగీతికల నాలాపిస్తూ విహరించటానికి అవసరమైన స్వేచ్ఛా వాయువులను పీల్చగలిగేవరకు పరుగిడుతుంది. అంటే సాంఘిక కట్టుబాట్లకు లోబడి, ఒకరి సన్నిధిలో ఒకరు వెచ్చగా, పచ్చగా, మది మెచ్చగా సుఖజీవనం సాగించేందుకు వీలుగా 'పెళ్ళి చేసుకోటానికి పూనుకొంటారు: అంటే హృదయాలు కలసి 'మనమిద్దరమూ పరస్పరం అర్థంచేసుకొన్నామని' ప్రేమికులు అనుకొంటే అప్పుడే ఆ వివాహమనేది ఆటోమేటిగ్గా దానంతటదే ఐపోతుంది. లేదా ఐపోయినట్టవుతుంది. మొత్తానికి మనసులు కలిస్తే మటుకు పెళ్ళికి పందిరి తలెత్తటానికి, పదిమంది పెద్దల మీద పన్నీరు చిలికించటానికీ, పంచభక్ష్యపరమాన్నాలు పంచిపెట్టటానికీ, ఐనవారికి పట్టువస్త్రాలివ్వటానికీ దారీ, తెన్నూ, అనేవి ఏర్పడుతాయి. ఆ కోవకు చెందిన పెళ్ళివైభవం ప్రేమించుకున్న వుభయులకు ఏమాత్రం భయంలేదని అభయం ఇస్తుంది. ప్రేమికులు ఒకరినొకరు ఓరచూపుకానీ, కోరచూపుకానీ, దొంగచూపుకానీ, బెంగచూపుకానీ, మరేచూపులోనైనాకానీ తనివితీరా చూచుకోటంలో కూడ ఇద్దరూ 'అనుకోటమనేది' వారిదృష్టిలోమాత్రం తమకు ఆటోమాటిగ్గా నెత్తిన తలంబ్రాలు పడ్డాయని తలపోయటం తరచు పరిపాటి. కానీ సమాజంచేత గుర్తింపబడని అల్లాంటి పెళ్ళి ఆ ప్రేమపక్షులకు అసంఖ్యాకమైన ఆపదలను తెచ్చిపెడుతుందనటంలో ఆవగింజపాటి అత్యుక్తి ఉండబోదు.

'చెప్పేది సులభం, చేసేది కష్టం' అనేది అనుభవంలో అందరికీ అవగాహనమైన అంశమే; అల్లాగే ఆ ఇద్దరూ అనుకోటం తేలిక గానీ, ఆచరణలో పెట్టి వ్యవహరించటం కడు దుర్లభమనేది ఆ ప్రేమికులకు అనుభవమవుతుంది. పెళ్ళవుతే తప్ప ఇద్దరూ ఆ అనుభవానికి గురికాక తప్పించుకోలేరు; ప్రపంచమంతా ఒక్కటై వచ్చినా దాన్ని కాస్త ఎదురించగలమనే ఏక నిశ్చయంతో ఏకమై, ఏకమైన హృదయాలను అరచేతుల్లో పెట్టుకుని లోకుల దృష్టిలో కూడ ఏకమయ్యామని ఏకధాటిగా మాటలు వల్లించటానికి గాను ఏకం కావటానికి తహతహ లాడవచ్చు; ఎవ్వరూ ఉండని ఏకాంత ప్రదేశంలో ఏక కంఠంతో ఎన్ని మాటలైనా మాటాడుకొంటారు కానీ సాంఘిక జీవితంలో అంతస్థుల అంతరాలు, కుల గోత్రాలు అవీ ఇవీ అడ్డు వస్తాయనే విషయాన్ని వారు విస్మరిస్తారు.' తెర వెనుక నేపథ్య గాయకుని గీతికలా అల్లా అడ్డువచ్చే వాటిని ముందుంచుకొని పలు రకాలుగ పరిహాసిస్తూ మాటాడే పెద్దలు ఆ ఇద్దరి మధ్య అడ్డుగోడల్లా అడ్డం నిలుస్తారు. తత్ఫలితంగా ఆ ప్రేమ వివాదాంత మవుతుంది. ఒకవేళ చెప్పుకోదగ్గ విషాదానికిగురి